

నిధులు లేక పట్టణాల్లో అభివృద్ధి కుంటుపడుతుంటుంది. నిధులు ఉండి రాజకీయ ఆధిపత్య పోరుతో అభివృద్ధి కుంటుపడుతున్న పరిస్థితి మాత్రం ప్రొద్దుటూరు మున్సిపాలిటీకే దక్కుతుంది. గత ఏడాది డిసెంబరు నుంచి ఇప్పటి వరకు కౌన్సిల్ సమావేశాలు సక్రమంగా జరగకపోవడంతో టెండర్లు అయిన పనులు ఆమోదం పొందక.. కొత్త పనులు ప్రతిపాదనలకు నోచుకోక అభివృద్ధి కుంటుపడుతోంది. దీంతో రూ.30 కోట్ల మేర 15వ ఆర్థిక సంఘం నిధులు మున్సిపాలిటీలో మురుగుతున్నాయి.

# అభివృద్ధికి రాజకీయ గ్రహణం

- కొనసాగుతున్న కౌన్సిల్ సమావేశాల వాయిదాలు
- ప్రొద్దుటూరులో టీడీపీ, వైసీపీ ఆధిపత్య పోరు
- ఎత్తులకు పైఎత్తులతో కుంటుపడుతున్న పట్టణ ప్రగతి
- మురుగుతున్న రూ.30 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు





ప్రొద్దుటూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారం మారినా ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పాలకమండలి వైసీపీ చేతిలోనే ఉంది. మున్సిపల్ పీఠం నుంచి వైసీపీని దించేసి వారి ఆధిపత్యానికి చెక్ పెట్టాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి నాయకత్వాన టీడీపీ ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా వైసీపీ నుంచి దాదాపు 18 మంది కౌన్సిలర్లను టీడీపీలో చేర్చుకున్నారు. మరో ఇద్దరు కౌన్సిలర్లు జనసేన, కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. వారూ టీడీపీకి మద్దతుగా ఉన్నారు. మొత్తం 40 మందికి గాను 20 మంది కౌన్సిలర్లు టీడీపీలో ఉన్నారు. త్వరలో మున్సిపాలిటీలో అధికారం మారుతుందని అందరూ అనుకుంటున్న తరుణంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు చక్రం తిప్పారు. టీడీపీలోకి వెళ్లిన వారిలో ముగ్గురిని మళ్లీ వైసీపీ గూటికి చేరేలా పావులు కదిపారు. దీంతో వైసీపీకి మున్సిపాలిటీలో బలం 23కు పెరిగింది. ఈ పరిణామాలు టీడీపీకి మింగుడు పడటం లేదు. ఇది ఒకరకంగా టీడీపీ నాయకత్వానికి పెద్ద సవాలుగా మారింది. దీంతో మున్సిపాలిటీలో టీడీపీ, వైసీపీ మధ్య ఆధిపత్య పోరు తీవ్రమై అది కౌన్సిల్ సమావేశాలు జరగపోవడానికి దారి తీసింది. ఇందువల్ల చాలా అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది.

### మధ్యలోనే వెళ్లిపోయిన చైర్‌పర్సన్

గత ఏడాది నవంబరు వరకు కౌన్సిల్ సమావేశాలు సజావుగా జరిగాయి. డిసెంబరులో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం ప్రకటించి సభను వాయిదా వేశారు. జనవరి 31న వైసీపీ మున్సిపల్ పాలకమండలి బడ్జెట్ సమావేశం జరిపి అదేరోజు సాధారణ సమావేశాన్ని వాయిదా వేసి చైర్‌పర్సన్ వెళ్లిపోయారు. దీనిని టీడీపీ కౌన్సిలర్లు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆక్షేపించారు. ఎమ్మెల్యే సూచన మేరకు కోరం సభ్యులు ఉన్నారంటూ కమిషనర్ మల్లికార్జున కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఆ అజెండాను తాత్కాలిక చైర్మన్‌గా ఉన్న మురళీధర్‌రెడ్డి ఆమోదించారు. దీంతో వైసీపీ, టీడీపీ మధ్య పోరు మరింత తీవ్రతరమైంది.

### హైకోర్టుకు చైర్‌పర్సన్..

వాయిదా వేసిన సమావేశాన్ని టీడీపీ కోరం సభ్యులతో నిర్వహించడాన్ని సవాల్ చేస్తూ వైసీపీ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి హైకోర్టులో కమిషనర్ మల్లికార్జున మీద కేసు వేశారు. ఆ కేసు కారణంగా జనవరి 31న సాధారణ సమావేశంలో చైర్‌పర్సన్ లేకుండా ఆమోదించిన అజెండాలోని అంశాలేవీ ఆచరణలోకి రావని వైసీపీ వారు అంటున్నారు. ఆ అజెండాలో కూరగాయల మార్కెట్ గెజిట్ రేట్ల పెంపు, మార్కెట్‌వేలం, ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రధానరోడ్ల విస్తరణ పనులు, 15 ఫైనాన్స్‌కు చెందిన రూ.3కోట్ల టెండరు పనులు, ప్రొద్దుటూరు మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేయడానికి ప్రతిపాదనల తీర్మానం, బొల్లవరం మున్సిపల్ ప్లాట్ల విక్రయాలకు అనుమతులు.. లాంటి అనేక ముఖ్యమైన అంశాలు నిలిచిపోయాయి.

### ఎత్తుకు పైఎత్తులతో..

ఫిబ్రవరిలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల కారణంగా కౌన్సిల్ మీటింగ్ జరుపలేదు. మార్చి 22న అత్యవసర సమావేశం జరపాలని మున్సిపల్ పాలక మండలి కమిషనర్‌ను ఆదేశించింది. వరుస వాయిదాలతో చాలా అంశాలు, అభివృద్ధి పనులు పెండింగ్ పడ్డాయని సాధారణ సమావేశం జరుపుకుందాం అని కమిషనర్ వారికి జవాబు ఇచ్చారు. కమిషనర్ సూచనలు పట్టించుకోకుండా వైసీపీ వారు కౌన్సిల్ సమావేశం నిర్వహించడానికి వెళ్లారు. కమిషనర్ మల్లికార్జునతో పాటు టీడీపీ కౌన్సిలర్లు, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, మున్సిపల్ సిబ్బంది కౌన్సిల్ సమావేశానికి వెళ్లలేదు. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్, వైసీపీ కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయంలో ఆందోళన చేపట్టారు. సాయంత్రం 5.30 గంటలకు కమిషనర్ మల్లికార్జున అక్కడకు వెళ్లి మార్చి 24 తేది సాయంత్రం సమావేశం నిర్వహించడానికి అంగీకరించారు. కానీ మార్చి 24న సాయంత్రం సమావేశానికి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, టీడీపీ కౌన్సిలర్లు రాలేదు. దీంతో మున్సిపల్ కమిషనర్ కూడా రాజకీయ ఒత్తిళ్ల కారణంగా సభకు వెళ్లకుండా కడపలో కలెక్టర్ మీటింగ్‌కు వెళ్లారు. డీఈ దస్తగిరిని డెలిగేట్ కమిషనర్‌గా పంపారు. తిరిగి మార్చి 29న ఏర్పాటు కావాల్సిన సాధారణ సమావేశం కూడా జరగలేదు. ఈ ఆధిపత్య పోరుకు ఎప్పుడు తెరపడుతుందో ఏమో గానీ ప్రొద్దుటూరులో అభివృద్ధిపనులకు మాత్రం గ్రహణం పట్టినట్లయింది. ఇప్పటికైనా ప్రొద్దుటూరు పట్టణ అభివృద్ధి విషయంలో ఆధిపత్యాలను పక్కన పెట్టి పనిచేయాలని ప్రజలు కోరుతున్నారు.



జనవరి 31న సమావేశాన్ని వాయిదా వేసి చైర్‌పర్సన్ వెళ్లిపోవడంతో కోరం ఉందంటూ సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వరద



మార్చి 22న సమావేశానికి కమిషనర్ రాకపోవడంతో సాయంత్రం వరకు కౌన్సిల్ హాల్‌లోనే బైఠాయించిన చైర్‌పర్సన్, వైసీపీ కౌన్సిలర్లు

## అటవీ వన్యప్రాణుల సంరక్షణకు కృషి

- కడప - రేణిగుంట ఎన్‌హెచ్ రహదారికి అటవీశాఖ క్లియరెన్స్‌పై సమీక్ష
- ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అజయ్‌కుమార్‌నాయక్



కనుమలోపల్లి సమీపాన కోతుల వంకను పరిశీలిస్తున్న అధికారులు

సిద్దవటం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో అటవీ వన్యప్రాణుల సంరక్షణకు కృషి చేస్తామని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అజయ్‌కుమార్‌నాయక్ తెలిపారు. మండలంలోని జేఎంజే కళాశాల సమీపంలోని కోతుల కోనవంక బ్రిడ్జి సమీపంలో శనివారం కడప - రేణిగుంట 716 ఎన్‌హెచ్ రహదారికి సంబంధించిన అటవీశాఖ క్లియరెన్స్‌పై నేషనల్ హైవే తిరుపతి పీడీ వెంకటేశ్వర్లు, సైట్ ఇంజనీర్ దిలీప్‌తో ఆయన సమీక్షించారు. గత రెండేళ్ల నుంచి అటవీ పర్యావరణ వన్యప్రాణుల క్లియరెన్స్ లేనందున నేషనల్ హైవే పనులు ఆగిపోయాయి. ఈ సందర్భంగా నేషనల్ హైవే అధికారులు కోతుల కోన బ్రిడ్జి నుంచి చర్చి వరకు వన్యప్రాణుల కదలికల కోసం మొత్తంగా 1100 మీటర్లు ఎలివేటెడ్ రోడ్డు నిర్మిస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చారు. అనంతరం పీసీసీఎఫ్ మాట్లాడుతూ అటవీ సంపదకు, పర్యావరణానికి, వన్యప్రాణులకు ఎలాంటి నష్టం లేకుండా నేషనల్ హైవే పనులను చేపట్టాల్సి ఉందన్నారు. వన్యప్రాణుల కదలికల కోసం కమిటీ ప్రతిపాదనల మేరకు కనుమలోపల్లె గ్రామ పరిధిలోని కోతులవంక బ్రిడ్జి నుంచి చర్చి వరకు 5.5 కి.మీ. ఎలివేటెడ్ రోడ్డు నిర్మించాల్సి ఉందని తెలిపారు. కడప జిల్లాలోని కడప, గండికోట, బద్వేల్, ప్రొద్దుటూరు వంటి ప్రాంతాల్లో కొండ ప్రాంతానికి దగ్గరగా సేదదీరేందుకు పర్యాటకుల కోసం నగర వనాలు నిర్మిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పులుల గణన జరుగుతుందని, ప్రస్తుత వేసవిలో అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులు బయటకు రాకుండా సాసర్ తొట్లను ఏర్పాటు చేసి వాటిలో నీటిని నింపి దాహార్తి తీరుస్తున్నామన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ముందుకెళ్తామన్నారు. షాడో డీఎఫ్‌వో రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణా తగ్గుముఖం పట్టిందని, అక్రమ రవాణా జరగకుండా ఉండేందుకు 22 బేస్ క్యాంపులను, కడప-నెల్లూరు, అన్నమయ్య జిల్లాల సరిహద్దులో 9 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కడప డీఎఫ్‌వో వినీత్‌కుమార్, స్క్వాడ్ సబ్ డీఎఫ్‌వో స్వామి వివేకానంద, ట్రైనీ డీఎఫ్‌వో శ్రీకాంత్, కడప రేంజర్ ప్రసాద్, సెక్షన్ ఆఫీసర్, ఫారెస్ట్ బీట్ అధికారులు, అసిస్టెంట్ బీట్ అధికారులు పాల్గొన్నారు.

## రేపు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక

- మంత్రులతో కలసి మహానాడు వేదిక కోసం స్థల పరిశీలన

(కడప-ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడుకు ఈసారి కడప వేదిక కానుంది. మహానాడును మే 27, 28, 29 తేదీల్లో మూడురోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మహానాడు వేదిక స్థల పరిశీలన కోసం సోమవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాశ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, మంత్రులు పయ్యావుల కేశవ్, బీసీ జనార్ధన్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డితో పాటు పలువురు ముఖ్య నేతలు కడపకు రానున్నారు. మహానాడు నిర్వహణ కోసం రాజంపేట రోడ్డులోని ఓ దేవాలయానికి సమీపంలో ఉన్న ఎన్జీవో ప్లాట్స్ విమానాశ్రయం వద్ద అలంఖాన్‌పల్లెకు చెందిన లక్ష్మిరెడ్డి స్థలాన్ని పరిశీలించనున్నారు. అనంతరం మహానాడు నిర్వహణపై జిల్లా నేతలతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో మహానాడు వేదిక స్థలాన్ని పరిశీలించేందుకు కడపకు వస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు సమాచారం ఇచ్చారు.

### ఏపీ జెన్‌కో హైడ్రో పవర్ ప్రాజెక్టుకు
## నీటి కేటాయింపుల స్థిరీకరణ

కలికిరి / కడప, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ముద్దనూరు మండలం ఆరవీటిపల్లె వద్ద ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో 1320 మెగా వాట్ల సామర్థ్యంతో ప్రారంభిస్తున్న కొత్త పంప్‌డ్ హైడ్రో స్టోరేజీ పవర్ ప్రాజెక్టుకు అవసరమైన నీటి కేటాయింపులను స్థిరీకరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టుకు 16.54 మిలియన్ క్యూబిక్ మీటర్ల (0.585 టీఎంసీ) స్థిరమైన నీటి నిల్వ అవసరమవుతుంది. ఏడాది పొడవునా పంపింగ్ కారణంగా 2.5 మిలియన్ క్యూబిక్ మీటర్ల (0.09 టీఎంసీ) నీరు తరుగుదల వస్తుంది. గండికోట రిజర్వాయర్ నుంచి ఈ నీటిని గాలేరు-నగరి కాలువలో 14.650 వ కిలోమీటరు వద్ద మళ్లించి హైడ్రో పవర్ ప్రాజెక్టుకు తరలించాల్సి ఉంది. ఈ మేరకు నీటి సరఫరా కోసం ఏపీ జెన్‌కో చేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మొదట స్థిరమైన నిల్వ కోసం అవసరమైన 16.54 మి.క్యూ.మీ నీటిని కేటాయించడంతో పాటు అనంతరం ప్రతి ఏటా తరుగు నీటిని భర్తీ చేసేందుకు అవసరమైన 2.5 మి.క్యూ.మీ. నీటిని విడుదల చేయడానికి ప్రభుత్వం అంగీకరించింది. అయితే నీటి సరఫరా కోసం జలవనరుల శాఖ నిర్దేశించే షరతులకు అనుగుణంగా ఉంటాయని స్పష్టం చేసింది. ప్రస్తుతం గాలేరు నగరి కాలువ ప్రయోజనాలైన తాగు, సాగునీటి అవసరాలకు పోనూ మిగులు నీటిని మాత్రమే జెన్‌కో వినియోగించుకోవాలని షరతు విధించింది. నీటి సరఫరాకు అవసరమయ్యే ఇన్‌టేక్ వెల్, పంప్ హౌస్, పైపు లైన్లు ఇతరత్రా సౌకర్యాలను ఏపీ జెన్‌కో సమకూర్చుకోవాలని తెలిపింది. మొత్తం 31 షరతులను విధిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ శనివారం నీటి కేటాయింపుల స్థిరీకరణ ఉత్తర్వులు జారీ చేశారు.

# శాస్త్రోక్తంగా అంకురార్పణ

▸▸ ప్రారంభమైన కోదండరాముడి బ్రహ్మోత్సవాలు



పుట్టమన్ను తెస్తున్న వేదపండితులు





అంకురార్పణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు శనివారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి పరివార దేవతలకు తిరుమంజనం, ఆరాధన, అర్చన చేశారు. సాయంత్రం ఆగమ పండితులు రాజేశ్‌కుమార్‌ను ఆయన ఇంటివద్ద నుంచి మేళతాళాలతో స్వాగతం పలికి ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం 6 గంటలకు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ఇందులో భాగంగా సీతారామ లక్ష్మణ ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి విష్వక్సేన పూజ, కలిశ ప్రతిష్ఠ, కలశ పూజ, వాసుదేవ పుణ్యాహవచనం, కంకణధారణ చేశారు. అనంతరం పుట్టమన్ను సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, ఇన్‌స్పెక్టర్ నవీన్, టీటీడీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఏర్పాట్లు పరిశీలించిన జేఈవో

కోదండరాముడి కల్యాణోత్సవం కోసం కల్యాణవేదిక వద్ద ఏర్పాట్లను శనివారం టీటీడీ జేఈవో వీరబ్రహ్మం పరిశీలించారు. అనంతరం టీటీడీ పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అధికారులు పటిష్ట ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కల్యాణోత్సవాన్ని ప్రతిఒక్కరూ తిలకించేలా 15 ఎల్ఈడీ స్ర్కీన్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 100 సీసీ కెమెరాలు, 3 డ్రోన్‌లు, 3 కంట్రోల్ రూములు, 2400 మంది భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కల్యాణవేదిక ప్రవేశ ప్రారంభంలోనే తలంబ్రాల పంపిణీ కోసం 16 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్‌ఎర్విన్, టీటీడీ సీఈ సత్యనారాయణ, ఎలక్ట్రికల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, రవాణశాఖ జీఎం శేషారెడ్డి, డిప్యూటీ ఈవోలు ప్రశాంతి సెల్వం, శివప్రసాద్, డీపీపీ కార్యదర్శి శ్రీరామరఘునాథ్, తహసీల్దారు రమణమ్మ తదితరులు పాల్గొన్నారు

### నేడు శ్రీరామనవమి వేడుకలు

కోదండరాముడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు ధ్వజారోహణ, సాయంత్రం పోతన జయంతి వేడుకలను నిర్వహించనున్నారు. అనంతరం శ్రీరామచంద్రులు శేషవాహనంపై ఊరేగనున్నారు.

## బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్/క్రైం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సామాజిక విప్లవ యోధుడు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి కొనియాడారు. శనివారం కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాల్లో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జ్యోతి ప్రజ్వలన అనంతరం కలెక్టర్, అధికారులు, వివిధ సంఘాల నేతలతో కలసి బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడం, వివక్షను నిర్మూలించడలో ఆయన చేసిన కృషికి గుర్తుగా ఆయన జయంతిని భారత ప్రభుత్వ సమతా దివస్‌గా పరిగణిస్తున్నారన్నారు. చిన్న వయసులోనే రాజకీయాల్లోకి వచ్చి సుదీర్ఘకాలం పార్లమెంట్‌లో వివిధ హోదాల్లో మంత్రిత్వ శాఖల్లో సేవలందించారన్నారు. విలువలతో కూడిన ఆయన జీవితం అందరికీ ఆదర్శమని ఆయన అడుగుజాడల్లో నేటి యువత నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ అనితాదీప్తి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

- స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ కొనియాడారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను ఎస్పీ కొనియాడారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. కుల వివక్షను నిర్మూలించేందుకు నిరంతరం పోరాడారని వివరించారు. హరిత విప్లవం ద్వారా దేశ వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేయడంలో ప్రధాన భూమిక పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య, ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## డాడీహోం రాజారెడ్డి హత్యకేసుపై సిట్ ఏర్పాటు



డాడీహోం అధినేత రాజారెడ్డి

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): డాడీహోం అధినేత రాజారెడ్డి హత్యకేసుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసింది. అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, ముగ్గురు సీఐలతో సిట్ ఏర్పాటు చేశారు. 2023 ఆగస్టు 11 తేది అర్ధరాత్రి 11 గంటలకు ప్రొద్దుటూరు మండలం చౌడూరు గ్రామంలోని పూజా ఇంటర్నేషనల్ స్కూల్లో ఉండగా డాడీ హోం అధినేత రాజారెడ్డి గుండెపోటుతో మరణించాడని ప్రచారం జరిగింది. అక్కడ ఉన్న నిర్వాహకులు ఆయనను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పోస్టుమార్టం చేసిన వైద్యుడు వీరనాథరెడ్డి కూడా రాజారెడ్డి గుండెపోటుతోనే మరణించాడని తప్పుడు నివేదిక ఇచ్చారు. దీంతో పూజ స్కూలులోని అనాథ పిల్లలు కొందరు కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసి రాజారెడ్డి మరణంపై అనుమానాలు వ్యక్తం చేయడంతో రీ పోస్టుమార్టం చేశారు. అందులో రాజారెడ్డి ఊపిరి ఆడక మరణించాడని తేలింది. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. అప్పటి వరకు రాజారెడ్డి ఫౌండేషన్‌కు సీఈవోగా ఉన్న ప్రసన్నను రాజారెడ్డి తొలగించి అనాథపిల్లలకు ఈ సంస్థ బాధ్యతలు కట్టబెట్టారు. దీంతో రాజారెడ్డి తమ్ముడు శ్రీధర్‌రెడ్డి అతని భార్య సీఈవో ప్రసన్న కక్షకట్టి రాజారెడ్డి ముఖంపై చేతులతో ఊపిరి ఆడనీడకుండా చేసి చంపారు. ఈ మేరకు ప్రసన్న, ఆమె భర్త రాజారెడ్డి తమ్ముడు శ్రీధర్‌రెడ్డి, శివ, సుభాన్, డాక్టర్ వీరనాథ్‌రెడ్డిలను ఈకేసులో అప్పటి ఏఎస్పీ ప్రేర్ణకుమార్ అరెస్టు చేశారు. అయితే ఈ హత్య వెనుక అప్పటి వైసీపీ నేతలతో పాటు ప్రజాప్రతినిధి హస్తం ఉందని, రాజారెడ్డి ఫౌండేషన్‌కు చెందిన కోట్లరూపాయల ఆస్తులను కాజేయడానికి ఈ హత్య జరిగిందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆరోపించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి రాజారెడ్డి హత్యవెనుక ఉన్న కుట్ర, అందులో ఉన్న పెద్దల హస్తం బహిర్గతం చేసేందుకు సిట్ ఏర్పాటు చేసింది.

# టన్నెల్ @ హంద్రీ-నీవా..!




మదనపల్లె మండలం కాట్లాటపల్లె వద్ద బూమర్‌తో టన్నెల్ తవ్వకం (ఫైల్)

- రక్షణ నుంచి నీటి సరఫరా వరకూ..!
- సులభతరమైన సొరంగం తవ్వకాలు
- ఉమ్మడి జిల్లాలో మూడు ప్రాజెక్టులు
- జలయజ్ఞంతో మొదలై.. ప్రజలకు చేరువై...

మదనపల్లె, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాజుల కాలంలో శత్రువుల నుంచి రక్షణ కోసం, జైళ్లలో ఖైదీలు తప్పించుకోవడానికి ఏర్పాటు చేసుకునే టన్నెల్ (సొరంగం) వ్యవస్థ ప్రస్తుతం సాధారణమైంది. కాలక్రమేణా అది రవాణా రంగానికి అటు నుంచి మరింత విస్తరించి నీటి సరఫరాకు ఉపయోగపడుతోంది. కాలువలు తవ్వడానికి వీలులేని కొండలు, గుట్టల్లో టన్నెల్ ఏర్పాటు చేసి వాటి ద్వారా నీరు తరలిస్తారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2005లో జలయజ్ఞం పనుల్లో భాగంగా మొదలైన టన్నెల్ వ్యవస్థ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2016లో మదనపల్లె, పెద్దమండ్యం, గుడుపల్లె మండలాల్లో హంద్రీ-నీవా పనులతో ప్రజలకు పరిచయమైంది. తాజాగా శ్రీశైలం ఎస్ఎల్‌బీసీలో ఇటీవల జరిగిన ప్రమాదం నేపథ్యంలో టన్నెల్‌పై మరోసారి ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. టన్నెల్ అంటే ఏంటి? దీనిని ఎలా తవ్వుతారు..? అందులో వచ్చిన మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పరిశీలనాత్మక కథనం.


### సొరంగం ప్రతిపాదన ఎప్పుడంటే ?

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో హంద్రీ-నీవా పనుల్లో సొరంగం పనులు కీలక భూమిక పోషించాయి. కాలువను 20 మీటర్ల నుంచి 30 మీటర్ల లోతు వరకు మాత్రమే తవ్వగలరు. మరింత లోతు వెళ్లాల్సి



సొరంగం లోపలి భాగం (ఫైల్)

వస్తే టన్నెల్ తవ్వడానికి అయ్యే ఖర్చు కంటే ఎక్కువ, క్లిష్టతరం కూడా. మరోవైపు కాలువ.. కొండలు, గుట్టలను చుట్టేయాల్సి వచ్చే సందర్భంలో సొరంగం ప్రతిపాదనకు వెళతారు. పెద్దమండ్యం మండలం సి.గొల్లపల్లె వద్ద ప్రధాన కాలువ, మదనపల్లె మండలం కాట్లాటపల్లె, రామిరెడ్డిగారిపల్లె వద్ద పుంగనూరు బ్రాంచి కెనాల్, గుడుపల్లె వద్ద కుప్పం బ్రాంచ్ కెనాల్‌పై వీటిని చేపట్టారు.



సొరంగం నుంచి రాళ్లు, మట్టిని బయటకు తరలిస్తున్న టిప్పర్లు (ఫైల్)

### అక్షాంశం-రేఖాంశంతో దిశ నిర్ణయం

సొరంగ మార్గాన్ని అక్షాంశం-రేఖాంశం ఆధారంగా కచ్చితంగా నిర్ణయిస్తారు. టన్నెల్‌ను ఎంట్రెన్స్, ఎగ్జిట్ రెండు వైపుల నుంచీ తవ్వకం మొదలు పెడతారు. రెండు వైపుల నుంచి తవ్వే రాళ్లు, మట్టిని బయటకు తీసుకురావడానికి అనుకూలంగా ఆడిట్ పాయింట్‌ను నిర్ణయిస్తారు. కంపాస్ ఆధారంగా ఉత్తర ధ్రువంలో ప్రారంభ మార్గం 11 డిగ్రీల కోణంలో ఉంటే..రెండో వైపు ఎగ్జిట్ మార్గంలో 191 డిగ్రీల కోణంలో ఉండే విధంగా రూపొందిస్తారు. ఇందులో ఒక డిగ్రీ వ్యత్యాసం వచ్చినా..రెండు వైపుల నుంచి వెళ్లే సొరంగ మార్గాలు కలుసుకోవు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఇంజనీర్లు టన్నెల్ వెళ్లే మార్గాన్ని దిశలో ఏమాత్రం తేడా లేకుండా జాగ్రత్తలు తీసుకుంటారు.

### రాయి పటిష్టతకు పరీక్షలు

టన్నెల్ తవ్వే ముందు కొండ, గుట్టలోని రాయి స్థితిని అంచనా వేయడానికి జియాలజిస్టులు కొన్ని పరీక్షలు నిర్వహిస్తారు. బోర్లు, ఎలక్ట్రిక్ పద్ధతిలో రాయి, మట్టి నమూనాలు సేకరించి పటిష్టతను నిర్ధారించి సొరంగం తవ్వకం మొదలు పెడతారు. ఇందులో రాయిని వెరీ గుడ్, గుడ్, ఫెయిర్, పూర్, వెరీపూర్ అనే విభాగాలుగా నిర్ణయిస్తారు. పనులు ప్రారంభం అయ్యాక.. ఇందులో ఏ రకం రాయి, మట్టి వచ్చినా..దానికి అనుగుణమైన సాంకేతిక పద్ధతులను అనుసరిస్తారు. ఇందులో గుడ్ రకం రాయిలో టన్నెల్ తవ్వకానికి అయ్యే ఖర్చుతో పోలిస్తే..ఫెయిర్‌కు రెట్టింపు ఖర్చు, తర్వాత పూర్‌కు, వెరీపూర్ స్థాయికి వెళ్లే సరికి ఎనిమిది రెట్లు ఖర్చు అవుతుందని అంచనా. అంటే రాయి, మట్టి బలహీనమయ్యే కొద్దీ..సమయం, ఖర్చు రెట్టింపు అవుతుంది.

### టన్నెల్ తవ్వకం ఇలా..!

టన్నెల్‌ను గతంలో గడ్డపారలతో వడ్డెరలు, నైపుణ్యం గల కూలీలు మాన్యువల్‌గా తవ్వుతుండగా, తర్వాత కాలంలో డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ పద్ధతులు అనుసరించారు. ప్రస్తుతం ఆ వ్యవస్థలో పలు రకాల ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో బూమర్, బోరింగ్ యంత్రాలతో సొరంగాలు తవ్వుతున్నారు. సొరంగాన్ని మాన్యువల్‌గా తవ్వడం ఒక పద్ధతి అయితే, రిగ్గులతో రంధ్రాలు పెట్టి పేలుడు పదార్థాలతో బ్లాస్టింగ్ చేయడం రెండోరకం. బూమర్‌తో నిర్దేశిత సర్కిల్‌లో రంధ్రాలు పెట్టడం మూడో మార్గమైతే.. టన్నెల్ నిర్దేశిత ప్రాంతం మొత్తం ఒకేసారి బోరింగ్ మిషన్‌తో (బోర్ డ్రిల్లింగ్ బిట్ తరహాలో) తవ్వడం నాలుగో పద్ధతి. ఆరు కంపార్ట్‌మెంట్లతో కూడిన రైలు లాంటి పరికరం ఇది. రూ.కోట్లు విలువ చేసే ఈ యంత్రాన్ని ప్రకాశం జిల్లా వెలుగొండ ప్రాజెక్టు సొరంగం పనుల్లో ఉపయోగించారు. దీనిని తిరిగి వెనక్కి తీసుకునే అవకాశం ఉండదు. అందులోనే వదిలేస్తారు.

### ఏడు రోజులు నిలిస్తేనే ముందుకు..!

తవ్విన టన్నెల్ కూలకుండా ఎన్ని రోజులు ఉంటుందనే దానిపైనే తవ్వకం కొనసాగింపు ఆధారపడి ఉంటుంది. కనీసం ఏడు రోజులు నిలచి ఉంటుందని నిపుణులు నిర్ధారించాకే పనులు కొనసాగిస్తారు. టన్నెల్ కూలిపోకుండాతీసుకునే చర్యలకే కనీసం ఏడు రోజుల సమయం పడుతుంది. అంతకంటే తక్కువ లైఫ్ ఉన్న టన్నెల్‌లోకి వెళ్లరు. అర్ధచంద్రాకారంలో ఉన్న టన్నెల్ చుట్టూ రిబ్బులు ఏర్పాటు చేసి (ఇనుప ప్లేట్లు), ఇతర సాంకేతిక పద్ధతుల్లో దానిని స్థిరీకరించిన తర్వాతే పనులు ప్రారంభిస్తారు. ఒకవేళ మధ్యలో ఎక్కడైనా టన్నెల్ కూలితే.. దాని పునరుద్ధరణకు ఎక్కువ సమయంతో పాటు, 20 రెట్లు అధికంగా ఖర్చు అవుతుందని అంచనా.

### కార్మికులకు నమ్మకం కలిగించాకే..!

కార్మికులు పనిచేయడానికి వెళ్లే ముందు టన్నెల్ సామర్థ్యాన్ని ఇంజనీర్లు పరీక్షిస్తారు. టన్నెల్ పైభాగాన్ని సుత్తితో కొడుతూ శబ్దాన్ని అంచనా వేస్తూ.. పై పొరల



సొరంగంలోని బ్లాస్టింగ్ పొగ, గాలిని బయటకు పంపే బెలూన్ (ఫైల్)

దృఢత్వాన్ని నిర్ధారిస్తారు. పైభాగం నుంచి రాళ్లు, మట్టి పెళ్లలు పడే అవకాశం లేదని నిర్ధారించుకున్నాకే.. కార్మికులంతా లోనికి ప్రవేశిస్తారు. ఎక్కడైనా..పెచ్చులు ఊడిపడే అవకాశముందని గుర్తిస్తే.. రాతి పొరలను కలుపుతూ డ్రిల్లింగ్ వేసి నట్ అండ్ బోల్టుతో లూజ్ మట్టి, పెచ్చులు పడకుండా కుట్టేస్తారు. తమకు భయం లేదని నిర్ధారించుకున్న తర్వాతే ఇంజనీర్లు, కార్మికులు హెల్మెట్ ధరించి సొరంగంలోకి ప్రవేశిస్తారు.

### 6.50 మీటర్ల వ్యాసంతో టన్నెల్ తవ్వకం

నీటి ప్రవాహాన్ని బట్టి సొరంగాన్ని 6.50-7.0 మీటర్ల వ్యాసంతో తవ్వుతారు. బూమర్‌తో 3 మీటర్ల లోతు రంధ్రాలు చేసి, అందులో పేలుడు పదార్థం నింపి పేలుస్తారు. అడుగు గ్యాప్‌తో టన్నెల్ చుట్టూ రంధ్రాలు పెడతారు. మొదట పైభాగంలోని రౌండ్‌లను, తర్వాత 40 మి.ల్లి.సెకన్ల వ్యవధిలో మధ్యభాగంలోని రంధ్రాల్లో జిలెటిన్ స్టిక్స్ పేలుస్తారు. మొదటి పేలుడుకు టన్నెల్ సర్కిల్ వెంబడి గ్యాప్ ఏర్పడగా, మధ్య పేలుడుతో మొత్తం రాయి, మట్టి శిథిలాలు కింద పడిపోయి సొరంగం ఆకృతి ఏర్పడుతుంది. తర్వాత పేల్చిన రాళ్లు, మట్టిని ఎక్స్‌కవేటర్‌తో తొలగించి టిప్పర్లతో బయటకు తెస్తారు. అదే బోరింగ్ మిషన్ పద్ధతిలో రైలు వెనుక ఉన్న ట్రాలీలతో బయటకు తెస్తారు.

### హంద్రీ-నీవాపై మూడు చోట్ల తవ్వకం

మదనపల్లె మండలం కాట్లాటపల్లె వద్ద 2 కి.మీ. తవ్వగా, పెద్దమండ్యం మండలం సి.గొల్లపల్లె వద్ద ప్రతిపాదించిన అయిదు కి.మీ.లలో 1.50 కి.మీ. వద్ద కూలిపోయింది. కుప్పం బ్రాంచి కెనాల్‌లో 400 మీటర్లు తవ్వారు. వీటిని 6.50 మీటర్ల వ్యాసంతో, బ్లాస్టింగ్ పద్ధతిలో పూర్తి చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రాజెక్టు రూపకల్పనలో ఇవి లేకపోయినా.. తర్వాత ప్రతిపాదించారు. అక్కడ కాలువలను తవ్వి కొండలు, గుట్టలను చుట్టేయడం కంటే సొరంగమే మేలని నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా కుప్పం బ్రాంచి కెనాల్‌పై గుడుపల్లె మండలం యామగానిపల్లె వద్ద 4 కి.మీ.. కొండ చుట్టూ కాలువ తవ్వాల్సి రావడంతో 400 మీటర్లు కొండలో సొరంగం తవ్వారు. ఇందులో కాలువ తవ్వకానికి రూ.6 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేయగా, తర్వాత రూ.2 కోట్లతో టన్నెల్ పూర్తి చేశారు.

### విష వాయువులు బయటకు..!

టన్నెల్‌లో బ్లాస్టింగ్ ద్వారా వెలువడే విషవాయువులను బయటకు పంపడానికి బెలూన్, యంత్రాల సాయంతో గాలిని లోపలికి పంపుతారు. బెలూన్ వెంబడి గాలి లోనికి వెళితే, అక్కడి విషవాయువులు గాలితో కలిసి టన్నెల్ గుండా బయటకు వస్తాయి. ఈ ప్రక్రియ జరగడానికి కనీసం రెండు గంటల సమయం పడుతుంది. రోజువారీ బూమర్‌తో 4 గంటలు పనిచేస్తే.. వాటిని పేల్చడానికి 2 గంటలు తీసుకుంటుంది. బ్లాస్టింగ్ తర్వాత శిథిలాలను టిప్పర్ల ద్వారా బయటకు పంపడానికి మరో 2 గంటలు పడుతుంది. రోజూ రెండు బ్యాచ్‌లుగా పనిచేసే ఇంజనీర్లు, కార్మికులు ఆ సమయంలో సొరంగంలో మరోవైపు నుంచి పనిచేస్తుంటారు.

### నీరు పల్లమెరుగనే నానుడికి నీళ్లొదిలాం..



ఎంతసేపు గ్రావిటీ ద్వారానే నీళ్లను తీసుకెళ్లాలనే నియమానికి నీళ్లొదిలాం. నీటిని ఎక్కడికైనా తీసుకెళ్లొచ్చనే సిద్ధాంతంతో లిఫ్ట్ సిస్టంను ప్రతిపాదించాం. ఆ తర్వాత టన్నెల్‌కు వెళ్లాం. అంతకు ముందు నంద్యాల-గిద్దలూరు మధ్య రైల్వే టన్నెల్‌ను అప్పట్లో గొప్పగా చెప్పుకునేవారు. దీనిని బ్రిటిష్ హయాంలో తవ్వారు. ఆ తర్వాత సాగునీటి రంగంలో మొదటగా నాగార్జునసాగర్ రైట్ కెనాల్‌లో 1960లో తవ్వారు. ఏపీలో హంద్రీ-నీవా రాకతో ఈపీసీ పద్ధతిలో టన్నెల్ చేయగలం అనే ధైర్యం వచ్చింది. మట్టిలో కంటే రాతి నేలల్లో సొరంగం తవ్వడం సులభం. పటిష్టంగా ఉంటుంది. హంద్రీ-నీవాలో నాలుగు మీటర్ల వెడల్పు సరిపోయినా.. ఆరు మీటర్లు తవ్వాల్సి వచ్చింది. అంత చిన్న సైజులో యంత్రాలు అందుబాటులో ఉండవు. ఉన్నా..ఖరీదైనవి. ఒకప్పుడు సొరంగం తవ్వకాల్లో నైపుణ్యం కలిగిన ఇంజనీర్లు జర్మనీ, రష్యా, ఫ్రాన్స్ దేశాలకే పరిమితం కాగా, ప్రస్తుతం వారు రాష్ట్రంలోనూ ఉన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఇతర దేశాల నిపుణులే సొరంగాల పనులు చేయగా, హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టుల్లో మేమే వాటిని ప్రతిపాదించాం.

-ఆర్.మురళీనాథ్‌రెడ్డి, హంద్రీ-నీవా, రిటైర్డ్ సీఈ, వెలుగొండ.

---

## మహనీయుల త్యాగాలను ఆదర్శంగా తీసుకోవాలి : ఎస్పీ



డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మహనీయుల త్యాగాలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకొని సమసమాజ స్థాపనకు కృషి చేయాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పేర్కొన్నారు. డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శనివారం ఆయన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాల వేసి పుష్పగుచ్ఛాలతో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహనీయుల ఆదర్శాలను పాటిస్తూ సమసమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. బాబుజగ్జీవన్‌రామ్ దేశ స్వాతంత్ర్యం, సామాజిక సమానత్వం కోసం అలుపెరగని పోరాటం చేసిన ఆదర్శనేత అని, మంచి నాయకుడిగా ప్రజల మనసుల్లో చిరస్మరణీయుడయ్యారన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, ఏఆర్ ఆర్‌ఐలు వీజే రామకృష్ణ, ఎం.పెద్దయ్య, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శంకరమల్లయ్య, రెడ్‌శ్యాండిల్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ మధు, రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- డిప్యూటీ సీఎం ఓఎస్డీ మధుసూదన్

తంబళ్లపల్లె, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కోటకొండ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఓఎస్డీ, విజయవాడ ఆర్డీవో మధుసూదన్ పేర్కొన్నారు. శనివారం ఆయన స్వగ్రామమైన తంబళ్లపల్లె మండలం కోటకొండకు వచ్చారు. ఈ సందర్భంగా కోటకొండ సచివాలయంలో పలు శాఖల అధికారులు, సిబ్బంది, స్థానికులతో సమీక్ష నిర్వహించారు. స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో హైస్కూలు భవనంతో పాటు పలు చోట్ల సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణాలు చేపట్టాలని, ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వ స్థలాలు మంజూరు చేయాలని, నూతన పింఛన్లు ఇవ్వాలని తదితర సమస్యలను స్థానికులు ఓఎస్డీ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని ఆయా శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. కాగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఓఎస్డీగా నియమితులైన తర్వాత తొలిసారి స్వగ్రామానికి వచ్చిన మధుసూదన్‌కు ప్రజలు, కుటుంబసభ్యులు ఘనస్వాగతం పలికారు. అనంతరం అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఏపీవో అంజినప్ప, ఎంఈవో త్యాగరాజు, ఈవోఆర్డీ దిలీప్‌కుమార్‌నాయక్, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం ఓఎస్డీ మధుసూదన్

## జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యుల ఎంపిక కోసం..
## ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు

- కమిటీలో వైవీయూ మహిళా ప్రొఫెసర్‌కు అవకాశం

కలికిరి/కడపఎడ్యుకేషన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలో ఏర్పాటు కానున్న జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులను ఎంపిక చేసేందుకు ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాయచోటితో పాటు రాష్ట్రంలోని మిగతా 13 కొత్త జిల్లా కేంద్రాల్లో జువైనల్ జస్టిస్ బోర్డులు ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు బోర్డులో చైర్మన్, సభ్యుల పదవుల కోసం ఆసక్తి ఉన్నవారు ఈ నెల 9వ తేదీలోగా దరఖాస్తు పంపుకోవాలని కోరుతూ ప్రభుత్వం నోటిఫి కేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ బోర్డుకు అర్హులైన చైర్మన్, సభ్యులను ఎంపిక చేయడానికి తాజాగా ప్రభుత్వం ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కమిటీ చైర్మన్‌గా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి యు.దుర్గాప్రసాదరావును నియమించారు. ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ఆ శాఖ కార్యదర్శి వ్యవహరించనున్నారు. సభ్యులుగా తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వి.లలితకుమారి, కడప యోగివేమన వర్శిటీ సైకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లలిత, ఏపీ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతితో పాటు ఒక యునిసెఫ్ ప్రతినిధి, సౌత్ రీజినల్ రీసోర్స్ సెంటర్ ఫర్ చిల్డ్రన్ ఇండియా ఫౌండేషన్ నుంచి మరో ప్రతినిధితో ఈ ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటైంది. మూడేళ్ల పాటు ఈ కమిటీ కార్యకలాపాల్లో పాల్గొంటుందని పేర్కొంటూ రాష్ట్ర స్త్రీ, బాలల, వయోవృద్ధులు, దివ్యాంగుల శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి ఆదేశాలు జారీ చేశారు.

## పార్టీ బలంగా ఉంటేనే మనం బలంగా ఉంటాం

- ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

కలికిరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతమై ప్రజల్లో విశ్వసనీయత పొందితేనే మనమంతా బలంగా వుంటామని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. గ్రామాల్లో అంతా కలిసికట్టుగా వుంటూ పార్టీ నిర్మాణాత్మకంగా బలపడేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో శనివారం నగరిపల్లెలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములు చేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు చేసిన అరాచకాలను, అందుకు ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతను గుణపాఠంగా స్వీకరించాలని సూచించారు.



టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న కిశోర్‌కుమార్ రెడ్డి

భూ కబ్జాలకు, దందాలకు పాల్పడితే సమర్థించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే ఆ దారిలో వున్నవారు సరిదిద్దుకోవాలన్నారు. నియోజకవర్గం నలుమూలల నుంచి మన వద్దకు వచ్చేవారు 10 శాతం మంది మాత్రమే వుంటారని, మరో 90 శాతం మంది మనం చేసే పనులను నిశ్శబ్ధంగా గమనిస్తుంటారని, ఎన్నికల్లో వారు తీర్పుతో సమాధానం చెబుతారన్నారు. వాల్మీకిపురంలో గత పదిహేనేళ్లుగా అర్థంతరంగా ఆగిపోయిన జైలు, అగ్నిమాపక కేంద్రాల భవనాలు తొందరలో పూర్తవుతాయన్నారు. కార్యకర్తల సమస్యలను పరిష్కరించని అధికారులు అవసరం లేదని, అలాంటి వారిని గుర్తించి సాగనంపాల్సి వుందన్నారు. రానున్న స్థానిక ఎన్నికలు చట్టబద్ధంగా జరుగుతాయని, నాయకులు ఇప్పటి నుంచే ప్రజలతో మమేకం కావాలని సూచించారు. సమావేశం అనంతరం పీలేరు, కలికిరి, వాల్మీకిపురం మార్కెట్ కమిటీలకు తాజాగా నియామకాలు పొందిన చైర్మన్లు పురం రామ్మూర్తి, మాలతి, కోసూరి చంద్రమౌళిలతో పాటు డైరెక్టర్లను సన్మానించారు.

## ఏపీజేఏసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీవో హోంలో శనివారం ఏపీజేఏసీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో మదనపల్లె డివిజన్ చైర్మన్‌గా నరసింహారెడ్డి, జనరల్ సెక్రటరీగా మధుసూదన, కోశాధికారిగా రెడ్డిశేఖర్ ఎన్నికయ్యారు. అలాగే కో-చైర్మన్లుగా రవిప్రకాష్, విజయకుమార్, నరసింహులు, విజయ్‌కుమార్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డిలు కార్యవర్గ సభ్యులుగా హేమలత, అశోక్, రామచంద్రారెడ్డి, రమాదేవి, సుధాకర్, మోహన్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, శేఖర్‌రెడ్డి, గిరివర్ధన్‌నాయుడు, చిన్నప్ప, గాలి రవీంద్ర, విద్యాధరరావు, రవినాయక్, మోహన్, నాగరాజ, ఆనందరెడ్డి, వెంకటయ్య, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ సుమారు 32 ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో నూతన కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యయ, పెన్షనర్ల, కార్మిక సమస్యలపై ప్రాతినిధ్యం వహించి సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

## సౌమ్యనాథస్వామి ఆలయ నిర్వహణకు టీటీడీ నిధులు

కలికిరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నందలూరు సౌమ్యనాథస్వామి ఆలయం నిర్వహణకు, జీతాల చెల్లింపులకు నిధులు విడుదల చేయడానికి టీటీడీకి అనుమతిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. టీటీడీ స్వాధీనంలో ఉన్న ఈ ఆలయం నిర్వహణ, సిబ్బంది జీతాల కోసం ఇతర 32 ఆలయాలకు చెల్లిస్తున్న నియమాల మేరకు నిధులు విడుదల చేయడం కోసం టీటీడీ ప్రభుత్వ అనుమతి కోరింది. ఈ మేరకు టీటీడీకి అనుమతిస్తూ దేవదాయ శాఖ కార్యదర్శి వి.వినయ్‌చంద్ శనివారం ఆదేశాలు జారీ చేశారు.

## ఈతకు వెళ్లి యువకుడి మృతి



శ్రీనివాసులు (ఫైల్‌ఫొటో)

సిద్దవటం/ఒంటిమిట్ట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం మండలంలోని ముమ్మడిగుంటపల్లె గ్రామంలో శనివారం మధ్యాహ్నం బావిలో తోటి విద్యార్థులతో ఈతాడుతూ ఒంటిమిట్ట మండలం పి.కొత్తపల్లె గ్రామానికి చెందిన తమ్మిశెట్టి శ్రీనివాసులు (16) అనే బాలుడు ప్రమాదవశాత్తూ మృతిచెందినట్లు గ్రామస్థులు తెలియజేశారు. ఈ విషయమై స్థానిక ఎస్ఐ మహ్మద్‌షరీఫ్‌ను వివరణ కోరగా తమకు ఎటువంటి సమాచారం లేదన్నారు. కాగా శ్రీనివాసులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాశాడు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు మృతదేహానికి నివాళులర్పించారు.

## అంతర జిల్లా దొంగలు అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా దొంగలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ కొండయ్యనాయుడు తెలిపారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నూల్ జిల్లా గూడురు మండలం చనగొండ్ల గ్రామానికి చెందిన మాదిగ దావీద్ కుమారుడు మాదిగ జార్జి (26) గుజిరీ వ్యాపారం నిర్వహిస్తూ జీవిస్తున్నాడని, అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం భైరవ గుట్ట గ్రామానికి చెందిన రమణ కుమారుడు రెడ్డిశేఖర్ (23) మోల్డింగ్ కమ్మీపని చేస్తు జీవిస్తున్నాడని తెలిపారు. వీరు ఇరువురు ఒక్కటై కురబలకోట మండలం అంగళ్లు, మదనపల్లె మండలం, సీటీఎం తదితర ప్రాంతాల్లో షాపు రూముల షట్టర్లు కట్ చేసి దొంగతనాలకు పాల్పడేవారని తెలిపారు. రాబడిన సమాచారం మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్, జిల్లా క్రైమ్‌పార్టీ సిబ్బంది కలిసి శనివారం కడప-మదనపల్లెరోడ్ కడపక్రాస్ వద్ద నిందితులిద్దరిని అదుపులోకి తీసుకుని అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి టీవీ, ల్యాప్‌ట్యాప్, 50 కేజీల కాపర్ వైరు, రెండు టేబుల్ ఫ్యాన్లు రికవరీ చేశామన్నారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు.

## వ్యక్తిపై దాడి.. ముగ్గురిపై కేసు నమోదు

కలకడ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నవాబ్‌పేట పంచాయతీ మండెంవారిపల్లెకు చెందిన రవీంద్రనాథ్‌రెడ్డిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రవీంద్రనాథ్‌రెడ్డి ఇంటికి సమీపంలోనే మునిరెడ్డి ఉంటున్నాడన్నారు. రవీంద్రనాథ్ రెడ్డి, అదే గ్రామానికి చెందిన వెంకటరమణారెడ్డితో ఆర్థిక లావాదేవీల విషయంగా వాదించుకున్నారు. ఈ క్రమంలో తమను ఉద్దేశించి మాట్లాడారంటూ మునిరెడ్డి, అతని భార్య రాణి, కుమారుడు ముఖేష్‌రెడ్డి కలిసి రవీంద్రనాథ్‌రెడ్డిపై దాడి చేసి గాయపరచినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు హెచ్‌సీ తెలిపారు.

## ఐటీడీపీ నేతకు ఆర్థిక సాయం

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గం టీడీపీ యువనేత దొమ్మలపాటి నగేష్ బాబు (ఆర్‌వీటి బాబు) మరోసారి దాతృత్వం చాటుకున్నారు. అప్పుల బాధ తాళలేక నాలుగురోజుల క్రితం మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన ఐటీడీపీ ఉపాధ్యక్షుడు వేల్పుల వెంకటేష్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆర్‌వీటి బాబు వెంటనే రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ చెక్కును జిల్లా చేనేత విభాగం టీడీపీ అధ్యక్షుడు బొమ్మిశెట్టిపురుషోత్తం చేతుల మీదుగా వెంకటేష్ భార్యకు అందించారు. కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాశీ, శ్రీరామ్, ముంబై దుర్గా, మహబూబ్‌ఖాన్, మోహన్ నాయుడు, అనిల్, రెడ్డిశేఖర్ నాయుడు, లోకేష్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

పులివెందుల వద్ద ప్రారంభానికి నోచుకోని బనానా ప్రాసెసింగ్ క్లస్టర్



అరటి రైతులు ఇప్పటి వరకు కాయలతోనే ఆదాయం ఆర్జించేవారు. కాయలతోనే కాదు అరటిచెట్లు కాండం, ఆకులు కూడా వారికి ఆదాయవనరుగా మారే అవకాశం ఉంది. అలాగే నిరుద్యోగ యువత, చిరువ్యాపారులకు కూడా ఉపాధి దొరుకుతుంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోనే మొట్టమొదటిగా పులివెందులలో బనానా ప్రాసెసింగ్ క్లస్టర్ ఏర్పాటు చేసింది. దీన్ని గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభం కూడా చేశారు. ఆ తరువాత అటు వైపు చూడలేదు. దీంతో క్లస్టర్ తలుపులు తెరుచుకోలేదు. ఉత్పత్తులు జరగడం లేదు. దీనిపై కూటమి ప్రభుత్వం అయినా స్పందిస్తుందా అని ఎదురు చూపులు చూస్తున్నారు.

# బనానా ప్రాసెసింగ్.. జరిగేనా...!

- రూ.4.80 కోట్లతో క్లస్టర్ ఏర్పాటు
- ప్రత్యక్షంగా 30, పరోక్షంగా 500 మందికి ఉపాధి
- ప్రారంభించినా.. ఉత్పత్తులకు నోచుకోని వైనం
- కూటమి ప్రభుత్వం దృష్టిసారించేనా

పులివెందుల రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె గ్రామ సమీపంలో రూ.4.80 కోట్ల నిధులతో బనానా ప్రాసెసింగ్ క్లస్టర్ నిర్మితమైంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2023 అక్టోబరు 24వ తేదీ వర్చువల్‌గా ప్రారంభించారు. పూర్తిగా సెంట్రల్ గవర్నమెంట్ స్కీం కావడంతో ఎక్కువ భాగం నిధులు కేంద్ర ప్రభు త్వం విడుదల చేసింది. మొదట రూ.56లక్షలు, రెండోసారి రూ.90లక్షలు, మూడోసారి రూ.40లక్షలు.. ఇలా పలుమార్లు నిధులు మంజూరు చేసింది. ఇంకా కేంద్రం నుంచి దాదాపు రూ.80లక్షల దాకా రావాల్సి ఉంది. కాగా రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.32లక్షలు చెల్లించింది. ఈ నిధులతో భవన నిర్మాణాలు, యంత్రాలు అమర్చడం తదితర చిన్నచిన్న పనులు దాదాపు 98శాతం పూర్తయ్యాయి.

**బనానా ప్రాసెసింగ్ క్లస్టర్ ప్రారంభమైతే..**

రాష్ట్రంలోనే మొట్టమొదటి బనానా క్లస్టర్ పులివెందులదే కావడం విశేషం. ఇక్కడ ఏర్పాటు చేసిన పులివెందుల బనానా ప్రాసెసింగ్ క్లస్టర్ ప్రారంభమైతే అనేక రకాల అరటి ఉత్పత్తులు తయారవుతాయి. అరటి కాయ నుంచి అరటి పౌడర్, చిప్స్, హనీడిప్డ్ బనానా తయారుచేస్తారు. ఆకులు, కాండం నుంచి నార, ప్లేట్లు, జ్యూస్ తయారవుతాయి. దీని వల్ల ప్రత్యక్షంగా 30 మందికి, పరోక్షంగా మరో 500 మంది దాకా ఉపాధి అవకాశాలు దక్కుతాయి.

**ప్రారంభించినా.. తెరుచుకోలేదు**

పులివెందుల బనానా ప్రాసెసింగ్ క్లస్టర్‌ను 2023 అక్టోబర్ 24న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన తలుపులు తెరుచుకోలేదు. భవన నిర్మాణం, యంత్రాలు, ఏటీఆర్ సోలార్ గదులు ఇలా అన్నీ ఏర్పాటయ్యాయి. దాదాపు ఒకటిన్నర సంవత్సరాలుగా తలుపులు తెరుచుకోలేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.80లక్షలు రావాల్సి ఉండడం, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టకపోవడంతో బిల్లులు మంజూరులో కొంత జాప్యం జరిగింది. ఇంతలో ఎన్నికల హడావుడి మొదలు కావడంతో పూర్తిగా పక్కనపెట్టేశారు. ఇదిలా ఉండగా సివిల్ పనులు చేసిన కాంట్రా క్టర్‌కు దాదాపు రూ.25 లక్షల బిల్లులు పెండింగ్ ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆ కాంట్రా క్టర్ తాళాలు తనవద్దే ఉంచుకున్నట్లు తెలిసింది. దీనిపై వివరణ అడిగేందుకు మార్కె టింగ్‌శాఖ ఏడీని ఆంధ్రజ్యోతి ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

**కూటమి ప్రభుత్వం చొరవ చూపేనా..**

దాదాపు 98శాతం పనులు పూర్తై ప్రారంభానికి నోచుకోని పులివెందుల బనానా ప్రాసెసింగ్ క్లస్టర్‌పై కూటమి ప్రభుత్వం చొరవ చూపేనా అని పలువురు రైతులతో పాటు నిరుద్యోగులు, చిరువ్యాపారులు సైతం ఆశగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేకపోవడంతో పలు రకాల బనానా ఉత్పత్తుల కోసం పులివెందుల వైపు చూసే అవకాశం ఉంది. ఇప్పటికే అరటికాయల సీజన్ ప్రారంభమైంది. దేశంలోని పంజాబ్, మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యానా, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వ్యాపారులు దిగు తున్నారు. మొదటి గెల అయిపోతుంది, రెండవ గెలకు ధర తక్కువగా పలుకుతుంది. క్లస్టర్ తెరుచుకుంటే రెండవ గెలను రైతులు క్లస్టర్‌కు విక్రయించే అవకాశాలు ఉన్నాయి. గెలల అనంతరం చెట్టును కూడా క్లస్టర్‌కు ఇచ్చే అవకాశం ఉంటుంది. దీంతో రైతుకు మరింత ఆదాయం చేకూరే అవకాశం ఉంది. కావున కూటమి ప్రభుత్వ చొరవ చూపి ప్రారంభించాలని కోరుతున్నారు.



బనానా ప్రాసెసింగ్ క్లస్టర్‌లో నిరుపయోగంగా ఉన్న యంత్రాలు

## జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షకు విశేష స్పందన



పరీక్షను పర్యవేక్షిస్తున్న ఐఏఎల్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్

కడప రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయవాదుల సఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షకు విశేష స్పందన లభించినట్లు భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు టి.ఈశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సి.సుబ్రమణ్యంలు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు 100 ప్రశ్నలతో కూడిన మల్టిపుల్ చాయిస్ ప్రకారం నిర్వహించిన మోడల్ పరీక్షకు 40 మంది న్యాయవాదులు హాజరయ్యారన్నారు. అభ్యర్థులు పరీక్ష రాయడం పూర్తి కాగానే కీని విడుదల చేసి సరిచూసుకోగా షేక్ ముస్తఫా 86 మార్కులు, సి. రాజ్యలక్ష్మి 84, ఏ రాహుల్ 80 మార్కులతో టాపర్స్‌గా నిలిచారన్నారు. కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రవదన, ఉపాధ్యక్షులు ఉమాదేవి, ట్రెజరర్ సురేష్, స్పోర్ట్స్ సెక్రటరీ చిన్నయ్య ఐఎల్ నాయకులు నాగసుబ్బారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకటశి పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి



అరటి పంటను పరిశీలిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్

లింగాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కె టింగ్ సౌకర్యం కల్పించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ ఎస్వీ ప్రవీణ్‌కుమార్‌ను రైతులు కోరారు. లింగాలలో శనివారం ఆయన ప్రకృతి వ్యవసాయం ద్వారా అరటి సాగు చేస్తున్న రైతు రావాంజనేయులురెడ్డి పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ద్వారా ఉత్పత్తి చేసే అరటి మొక్కలు సరఫరా చేయాలని రైతులు కోరారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులే అరటి మొక్కలు ఉత్పత్తి చేసేలా చర్యలు చేపడుతామని ఆయన తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ విధానాల గురించి రైతులకు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

## సాహిత్య వారసత్వ సంపదను కాపాడాలి



ఉగాది పురస్కారాలు అందుకున్న జిల్లా రచయితలకు సత్కారం

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఆది నుంచి సాహిత్యపరంగా గొప్ప పేరుందని, ఆ వారసత్వ సంపదను కాపాడాల్సిన బాధ్యత మీపైనే ఉందని అతిథులు అన్నారు. శనివారం ఇటీవల ప్రభుత్వం ద్వారా ఉగాది పురస్కారాలు అందుకున్న జిల్లా కవులను ఇంటాక్ సంస్థ స్థానిక మానస సమావేశ మందిరంలో ఘనంగా సత్కరించింది. సంస్థ జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు లయన్ కె.చిన్నపరెడ్డి అధ్యక్షతన యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎన్.ఈశ్వర్‌రెడ్డి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాష, డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీర సుదర్శన్‌రెడ్డి, కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, మునిరెడ్డి తదితరులు ఈ సందర్భంగా పురస్కార గ్రహీతల సాహితీ సేవలను కొనియాడారు. అనతరం పురస్కార గ్రహీతలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు తమకు లభించిన ఉగాదిపురస్కారాల జ్ఞాపికలను సభికులకు ప్రదర్శించారు. అనంతరం పురస్కార గ్రహీతలు మొగలిచెండు సురేష్ డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ వేంపల్లె షరీఫ్, డాక్టర్ జాన్సి వీరాంజనేయులు తమ మనోభావాలను తెలియజేశారు.

## పాల వ్యాపారి నుంచి రూ.12వేలు దోపిడీ



సీఐకి ఫిర్యాదు చేస్తున్న బాధితుడు

చెన్నూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కమలాపురం రోడ్డులో గల మదీనా ఇంజనీరింగ్ కాలేజీ వద్ద శనివారం మధ్యాహ్నం ఓ పాల వ్యాపారిని ద్విచక్ర వాహనంలో అడ్డగించిన ముగ్గురు అతని వద్ద నుంచి రూ.12వేలు దోచుకెళ్లారు. వల్లూరు మండలం గంగాయపల్లెకు చెందిన డి.సుబ్బారెడ్డి అనే వ్యక్తి కడపకు పాలు తీసుకెళ్లి అమ్ముకొని వచ్చేవాడు. ఈ నేపథ్యంలో రోజుమాదిరే శనివారం పాలు అమ్మి ద్విచక్ర వాహనంలో ఇంటికి వస్తుండగా మదీనా కాలేజీ వద్ద కమలాపురం నుంచి కడప వైపు ద్విచక్ర వాహనంలో వెళుతున్న ముగ్గురు యువకులు అడ్డుపడ్డారు. ఆ వెంటనే కొట్టి అతని వద్ద నుంచి రూ.12వేలు దోచుకు న్నారు. బాధితుడు జరిగిన విషయాన్ని సీఐ కృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు.

## గుర్తు తెలియని వృద్ధుడు మృతి



కమలాపురం రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాప్తాడు నగర పంచాయతీ ఆఫీసు సమీపంలో గుర్తు తెలియని ఓ వృద్ధుడు మృతి చెందినట్లు సీఐ రోషన్ తెలిపారు. ఇతను కమలా పురం వాసి అని సమాచారం వచ్చిందని.. గత ఎనిమిది నెలల నుంచి రాప్తాడులో భిక్షాటన చేస్తూ గురువారం చనిపోయినట్లు తెలిసిందన్నారు. ఇతని అడ్రస్ తెలిస్తే సీఐ 9121100529, ఎస్ఐ విద్యాసాగర్ 9121100532 నెంబరుకు సమా చారం ఇవ్వాలన్నారు.

## కుక్కల దాడి నుంచి పొడదుప్పిని కాపాడిన గ్రామస్థులు







గ్రామంలోకి వచ్చిన పొడదుప్పి, అడవిలోకి గ్రామస్థులు వదిలేయడంతో పరుగులు తీస్తున్న దృశ్యం

కలసపాడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అడవి నుంచి గ్రామంలోకి వచ్చిన పొడదుప్పిని శనివారం కుక్కల బారి నుంచి సింగరాయపల్లె గ్రామస్థులు కాపాడారు. గ్రామ సమీపంలోని అడివి నుంచి ఉదయం దుప్పి గ్రామంలోకి రాగా కుక్కలు వెంబడించాయి. గమనించిన గ్రామస్థులు కుక్కల బారి నుంచి రక్షించి అటవీ సిబ్బందికి సమా చారం ఇచ్చారు. పోరుమామిళ్ల ఫారెస్టు రేంజ్ అధికారి రఘునాథరెడ్డి ఆదేశాల మేరకు తంబళ్లపల్లె సెక్షన్ ఆఫీసర్ రమణయ్య, మామి ళ్లపల్లె బీట్ ఆఫీసర్ భారతి, డాగ్‌స్క్వాడ్ అధికారి హసన్ గురయ్య, ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది గ్రామస్థులు కలిసి వాహనంలో ఎక్కించి వా గు సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. దుప్పిని కాపా డిన సింగరాయపల్లె గ్రామస్తులకు అటవీఅధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

## సరదాగా ఈతకు వెళ్లిన యువకుడు మృతి





మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు, శివ (ఫైల్‌ఫొటో)

పులివెందుల టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సరదా కోసం ఈతకు వెళ్లిన శివ (30) అనే యువకుడు మృతి చెందిన సంఘటన పులివెందుల మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పులివెందుల మండల పరిధిలోని అచ్చవెల్లి పంచాయతీ కుమ్మరాంపల్లి గ్రామానికి చెందిన సుబ్బరాయుడు, బుజ్జమ్మల రెండో కుమారుడు శివ పట్టణంలోని ఎస్బీఎస్ హోం నీడ్స్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఇంటి సమీపంలో ఉన్న కాల్వలో శివ స్నేహితులతో కలిసి సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈత కొట్టే సమయంలో ఫిట్స్ రావడంతో శివ నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు గమనించి బయటికి తీసేసరికి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. చేతికొచ్చిన కొడుకు మృతితో వారి కుటుంబం విషాదంలో మునిగిపోయింది. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## కొత్త పింఛన్ బిల్లును ఉపసంహరించుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఏకపక్షంగా తీసుకువస్తున్న కొత్త పింఛన్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కడప నగరం ఎస్టీయూ భవన్‌లో జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు ఎస్ఎండీ ఇలియాస్ బాష అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ పింఛన్ పెంపుదల అనేది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్-14లోని ఆదేశాలని, వాటిని ఇపుడు ఉల్లంఘించడం ఎంతమాత్రం సరికాదన్నారు. సీపీఎస్/జీపీఎస్ స్థానంలో ఆమోదయోగ్యమైన పింఛన్ విధానం అమలు చేస్తామన్న ప్రభుత్వ మేనిఫెస్టో హామీని వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఏఐఎస్‌టీఎఫ్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ 12లక్షల మంది ఉద్యోగ ఉపాధ్యాయ పింఛనర్లకు చెల్లించాల్సిన 11వ పీఆర్సీ డీఏ, సరెండర్ లీవ్, సీపీఎస్ ఉద్యోగుల బకాయిలతో కలిపి దాదాపు రూ.23వేల కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. వెంటనే చెల్లింపులకు సంబంధించి రోడ్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సంయుక్త అధ్యక్షుడు కె.సురేష్‌బాబు, రాష్ట్ర నాయకులు రమణారెడ్డి, బాలగంగిరెడ్డి, రషీద్‌ఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌రెడ్డి ప్రసంగించారు. సమావేశంలో కడప జిల్లా ఇన్‌చార్జి శివశంకర్ రాష్ట్ర నాయకుల గురుకుమార్, దాదాపీర్, గురుప్రసాద్, రవిశంకర్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి లక్ష్యం నిర్దేశించుకోవాలి : ఎమ్మెల్యే మాధవి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, చిత్రంలో ఎమ్మెల్యే మాధవి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, విద్యాసంస్థల చైర్మన్ బి.శ్రీనివాసులు- ఎమ్మెల్యేకు సత్కారం

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించినప్పుడే వారు సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని ప్రభుత్వ విప్ కడప నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం కలిగి ఉండాలని సూచించారు. శనివారం కడప నగరం శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో ఆ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన వార్షికోత్సవ వేడు కలను నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కళాశాలలో సాంకేతిక పరమైన విద్యను అందివ్వడం అభినందనీయమన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ మాట్లాడుతూ శ్రీనివాస విద్యాసంస్థలు క్రమశిక్షణతో విద్యను అందించడం సంతోషకరమన్నారు. ఈ విద్యాసంస్థ నుంచి ఎంతోమంది విద్యా ర్థులు ఉన్నత స్థాయికి ఎదిగారని అన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ వై.నాగరాజు, డాక్టర్ యు.మోహన్‌కుమావర్ మాట్లాడారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సదర్శకులను అలరించాయి.

## గురుకుల విద్యాపీఠ్‌లో ఘనంగా ఆన్యువల్ డే




మాట్లాడుతున్న సీఈఓ వివేకానంద, చిత్రంలో వెంకటేశ్వర్లు, నృత్యం చేస్తున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎన్జీఓ కాలనీ గురుకుల విద్యాపీఠ్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏవీఆర్ విద్యాసంస్థల అధినేత వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు కలిగే విధంగా అభివృద్ధి చెందాలని విద్యార్థులకు సూచించారు. క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా గురువులు సూచించిన మార్గంలో నడవాలన్నారు. సీఈఓ వివేకానంద, డైరెక్టర్ ఎ.వీరకుమారి, డి.పల్లవి, ప్రిన్సిపాల్ మునిచంద్ర, వైస్ ప్రిన్సిపాల్ నరసింహులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

**విజయవాడ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి):** యువతి అనుమానాస్పద స్థితిలో చనిపోయినట్లుగా విజయవాడ మాచవరం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. విజయవాడ 5వ డివిజన్ ఫిలిమ్ కాలనీలో ఉంటున్న మచ్చ సరస్వతి, చైతన్యలకు ముగ్గురు పిల్లలు. సరస్వతి(36) హెల్ప్ హాస్పటలో డాక్టర్‌గా, భర్త చైతన్య ఆయుర్వేద డాక్టర్‌గా పనిచేస్తున్నారు. సరస్వతి ప్రతిరోజు మధ్యాహ్నం రెండు గంటలకు డ్యూటీకి వెళ్లి రాత్రి 8గంటలకు ఇంటికి వస్తారు. సరస్వతి చిన్న కుమారుడిని చూసుకునేందుకు కడప జిల్లా బద్వేలులో ఉంటున్న అక్క కూతురు బెల్లం శరణ్య(19) 3 నెలల నుంచి ఇక్కడే ఉంటోంది. సరస్వతి ప్రతి రోజూ డ్యూటీకి వెళ్లాక సాయంత్రం సమయంలో ఇంటికి ఒకసారి ఫోన్ చేసి మాట్లాడుతుంది. ఇదే క్రమంలో శుక్రవారం సాయంత్రం ఇంటికి ఫోన్ చేయగా శరణ్య స్పందించలేదు. ఫోన్ ఎంతకీ తీయకపోవడంతో ఇంటికి వచ్చి తలుపులు కొట్టినా తీయలేదు. దీంతో చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు పగలకొట్టి లోనికి వెళ్లి చూడగా శరణ్య బెడ్‌రూమ్‌లో చున్నీతో ఫ్యానుకు ఉరేసుకుని ఉంది. 108కి కాల్ చేయగా వారు వచ్చి చూసి అప్పటికే చనిపోయినట్లుగా నిర్ధారించారు. సమాచారం అందుకున్న మాచవరం సీఐ ప్రకాష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పూర్వాపరాలు సేకరించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## తొలగించిన రేషన్‌కార్డుపై మంత్రి స్పందన

### త్వరగా ఇవ్వాలంటూ పౌరసరఫరాలశాఖకు ఆదేశాలు

చెన్నూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నమాచుపల్లె గ్రామానికి చెందిన పైడికాల్వ భాగ్యమ్మకు చెందిన రేషన్‌కార్డు తొలగించడంతో ఆమె ఆవేదన వ్యక్తం చేయగా, ఆ విషయమై ఆంధ్రజ్యోతి దినపత్రికలో రేషన్‌కార్డు తొలగించారు, పింఛను కూడా రావడంలేదంటూ కథనం ప్రచురితమైంది. దీంతో ఆ వృద్ధురాలి ఆవేదనను జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారుల ద్వారా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలుసుకుని దానిపై స్పందించారు. కాగా ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు అధికారిక ఉత్తర్వులు లేవు మంజూరు కాగానే కొత్తరేషన్ కార్డు మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు.

## 'మహేశ్వర్‌రెడ్డి కుటుంబాన్ని ఆదుకోండి'

కడప మారుతీనగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా అనుచరుడైన ఇబ్రహీంమియాకు అప్పు ఇచ్చి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నగరంలోని కొండాయపల్లెకు చెందిన మహేశ్వర్‌రెడ్డి కుటుంబాన్ని ఆదుకోవాలని విద్యార్థి సంఘ నాయకులు తిరుమలేశ్, ఓబులేసుయాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2018-19 సంవత్సరంలో ఇబ్రహీంమియా అనే వ్యక్తి మహేశ్వర్‌రెడ్డి వద్ద నుంచి దశల వారీగా సుమారు రూ.46లక్షలు అప్పులు తీసుకున్నారన్నారు. నాటి నుంచి నేటి వరకు అప్పు తీర్చకుండా కాలయాపన చేస్తూ నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారన్నారు. సమావేశంలో మహేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన వైసీపీ నాయకులు

కడప క్రైం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌ను శనివారం మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, కడప మేయరు సురేశ్‌బాబు ఎస్పీ బంగ్లాలో కలిశారు. శుక్రవారం కొంత మంది మహిళలు డిప్యూటీ సీఎం ఇంటి ముందు ఆందోళన చేయడం, తమ పార్టీ నేత మియాను మహిళలు దాడి చేయడంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లాడన్నారు. అయితే తాను కూడా అక్కడికి వెళ్లడంతో తనపై ఉద్దేశ్యపూర్వకంగా కొంత మంది మహిళలను రెచ్చగొట్టి తన ఇంటి ముందు ధర్నా చేయించారంటూ ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఎస్పీని కలిసిన వారిలో డిప్యూటీ మేయరు నిత్యానందరెడ్డి, వైసీపీ నాయకులు ఉన్నారు.

## చట్టం అందరికీ సమానమే

### వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగం కులమతాల కతీతంగా అందరికీ సమాన హక్కు కల్పించిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి అన్నారు. శనివారం వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ముందుగా జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. లోక్‌సభలో వక్ఫ్‌సవరణ బిల్లు ఆమోదం పొందిందని చాలా రాజకీయ పార్టీలు వ్యతిరేకించినా ఆ బిల్లును ఆమోదించారన్నారు. ఈ అమెండ్‌మెంట్ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకంగా మేం భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సుబ్బారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, గంగాధర్‌రెడ్డి, ఆర్వీఎస్ఆర్, మోహన్‌రెడ్డి, మహ్మద్‌సాదిక్, నాగరాజుఆచారి, జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## సక్రమంగా పనిచేయండి : డీఎల్‌పీఓ రమాదేవి

వేంపల్లె, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో అధ్వానంగా ఉన్న పారిశుధ్యం మెరుగుపరిచేందుకు సక్రమంగా పనిచేయాలని పులివెందుల డీఎల్‌పీఓ భూమిరెడ్డి రమాదేవి పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. వేంపల్లె పంచాయతీలో చాలా సమస్యలు ఉన్నాయి. ఈఓగా ఇక్కడకు రావాలంటే హడల్ అని ఆంధ్రజ్యోతిలో కథనంరాగా డీఎల్‌పీఓ రమాదేవి శనివార వేంపల్లె పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. సర్పంచు ఆర్.శ్రీను, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**చెక్‌పవర్ మార్పు:** జమ్మలమడుగు డీఎల్‌పీఓ తిమ్మక్కకు ఉన్న వేంపల్లె మేజర్ పంచాయతీ చెక్‌పవర్‌ను డీపీఓ రాజ్యలక్ష్మి మార్చారు. పులివెందుల డీఎల్‌పీఓ రమాదేవికి చెక్‌పవర్‌ను తాజాగా అప్పగించారు. పంచాయతీలో అవినీతి ఆరోపణలు నేపథ్యంలో ఈఓ సస్పెండ్ కాగా సర్పంచు ఆర్.శ్రీను చెక్‌పవర్‌ను మొదట హోల్డ్‌లో ఉంచారు. తర్వాత రద్దు చేసి డీఎల్‌పీఓకు అప్పగించారు.

## బ్రాహ్మణ సంక్షేమం కోసం కృషిచేయాలి

వేంపల్లె, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు రఘునాథ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాదరావు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. బ్రాహ్మణులంతా కూటమి గెలుపునకు కృషిచేశారని గుర్తుచేశారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు.





# ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి





కడపలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి,మేయర్ సురేశ్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాష, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, టీడీపీ నేత హరిప్రసాద్ తదితరులు

కడప మారుతీనగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : జగ్జీవన్‌రామ్ గొప్ప సమతావాది అని పలు పార్టీలు, ప్రజా, దళిత సంఘాల నాయకులు కొనియాడారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శనివారం స్థానిక మహవీర్ సర్కిల్‌లో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళుల ర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కడప ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాసరెడ్డి, టీడీపీ రాష్ట్ర నాయకుడు హరిప్రసాద్, అన్నమయ్య జిల్లా మాదిగ కార్పొరేషన్ డైరెక్టరు అనిత దీప్తి, నాయకులు జయచంద్ర, ప్రభుత్వ మాజీ న్యాయవాది గురప్ప, బీసీ నాయకులు అవ్వారు మల్లికార్జున, దళిత నాయకులు జయరాం, కైపు రామాంజనేయులు, రామయ్య, తప్పెట శివ, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర నాథరెడ్డి, పలువురు ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**కడప కలెక్టరేట్..:** పేదల పెన్నిధి జగ్జీవన్‌రామ్ అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయజ్యోతి కొని యాడారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాల యంలో విజయజ్యోతి ఆధ్వర్యంలో బాబూ జగ్జీవ న్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహి ంచారు. అనంతరం నగరంలోని మహవీర్ సర్కిల్ లో గల డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహానికి నగరకాంగ్రెస్ అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్, పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో అలీ ఖాన్, సిరాజుద్దీన్,మామిళ్ల బాబు,ముబారక్ బాష, శ్యామలమ్మ,సంజయ్‌కాంత పాల్గొన్నారు.

**కడప ఎడ్యుకేషన్..:** జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఉప ముఖ్య మంత్రి అంజాద్ బాష, వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు పేర్కొ న్నారు. శనివారం కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ నగర అధ్యక్షుడు మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష అధ్యక్షతన బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహిం చారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు పాల్గొన్నారు.

**డాక్టర్ వైఎస్సార్ ఏఎఫ్‌యూ..:** డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ విశ్వనాథకుమార్, అధ్యాపకులు రవితేజ, సయ్యద్ అహ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.కాగా కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యం లో శనివారం కడప రామకృష్ణ నగర్‌లో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. కేవీపీఎస్ జిల్లా సీనియర్ నాయకులు జితేంద్ర,ఐఎన్ సుబ్బమ్మ, జార్జి శేఖర్ పాల్గొన్నారు.

**కడప ఎర్రముక్కపల్లె..:** జగ్జీవన్‌రామ్ ఆదర్శ ప్రాయుడని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్‌బాబు తెలిపారు. శనివారం జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాసర్ అలీ, మేకల వెంకటేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

**పులివెందుల రూరల్..:** సామాజిక విప్లవ యోధుడు జగ్జీవన్‌రామ్ అని ఆహార విజ్ఞాన శాస్త్ర,సాంకేతక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ కొనియాడారు. శనివారం జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కళాశాల స్టూడెంట్ ఆక్టివిటీ అధికారి డాక్టర్ నివేదిత, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొ న్నారు. స్థానిక వైసీపీ క్యాంప్ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

**వేంపల్లె..:** జగ్జీవన్‌రామ్ గొప్ప పరిపాలన దక్షుడు, దార్శనీకుడని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కాగా వేంపల్లె నాలుగు రోడ్ల కూడలిలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి దళితనాయకులు ఘన నివా ళులర్పించారు. దళితనేతలు పుల్లయ్య, నాగన్న, రాజా, రామాంజనేయులు, యుగంధర్, ఓబులేసు తదిత రులు నివాళులు అర్పించారు. అలాగే ఆమ్‌ఆద్మీ నాయకులు రంతుల్లా, దాదాపీర్ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళుల ర్పించారు.



నివాళులర్పిస్తున్న టీడీపీ నేత అమీర్‌బాబు

**సీకేదిన్నె..:** జగ్జీవన్‌రామ్ అందరికీ ఆదర్శప్రాయుడని సీకేదిన్నె దళిత సంఘం నాయకుడు మాతంగి సుబ్బరాయుడు, అట్లూరు సుబ్బరాయుడు తెలిపారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా చింత కొమ్మదిన్నెలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీజీ గంగయ్య పాల్గొన్నారు.

**కడప రూరల్..:** ప్రజానాయకుడు జగ్జీవన్‌రామ్ అని టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు శివశంక ర్‌రెడ్డి అన్నారు. టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా నగరంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న ఉలమా ఆయిమా నాయకులు

కడప మారుతీనగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని ఉలమా ఆయిమా కమిటీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధంగా సవరణ పేరుతో ముస్లిం హక్కులను భంగం కలిగించారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉలమా ఆయిమా నాయకులు పాల్గొన్నారు.

## అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

కడప మారుతీనగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) :అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, అరెస్టు చేసిన మౌలానా జాకీర్‌హుస్సేన్ ను విడుదల చేయాలని అఖిలపక్ష నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించడం దారుణమన్నారు. ఆ చట్టానికి వ్యతిరేకంగా మత గురువు మౌలానా జాకీర్‌హుస్సేన్ వ్యాఖ్యలు చేస్తే ఒక టెర్రరిస్టులా అరెస్టు చేయడం సరైందికాదన్నారు. చేశారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు రవిశంకర్‌రెడ్డి, గాలిచంద్ర, బాబు భాయ్, తాహిర్, అఫ్జల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యాలయంలో సంబరాలు



కమలాపురం రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) :కూటమి ప్రభుత్వం ప్రక టించిన మార్కెట్ యార్డు చైర్మన్‌గా 2వ విడతలో కమలాపురం నియోజక వర్గం, టీడీపీ మండల అధ్యక్షుడు శిరిగిరెడ్డి రాఘవరెడ్డి పేరును ప్రకటించిన సందర్భంగా టీడీపీ కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నాగిరెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి మాజీ చైర్మన్ జంపాల నరసింహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గుజ్జుల నారాయణ, రవీంద్రరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శంకర్ యాదవ్, నరసింహాచారి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## నేడు 'పది' మూల్యాంకనానికి సెలవు ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని ఆదివారం 10వ తరగతి మూల్యాంకనానికి సెలవు ప్రకటించాలని ఆపస్ ప్రతినిధులు డిమాండ్‌చేశారు. శనివారం కడప నగరం మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో జరుగుతున్న పదో తరగతి మూల్యాంకనం కేంద్రంలో డీఈఓ షంషుద్దీన్‌ను కలిసి వారు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమం లో ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయప్రసాద్, జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా శ్రీరామనవమి సందర్భంగా పదో తరగతి మూ ల్యాంకన విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు సెలవు దినంగా ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు రామాంజ నేయులు డిమాండ్ చేశారు. శనివారం కడప నగరం మున్సిపల్ హైస్కూల్ మెయిన్ మూల్యాంకన కేంద్రంలో డీఈఓ షంషుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు.

## భూసమస్యలు పరిష్కరించండి

చక్రాయపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో చాలా గ్రామాలలో భూసమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని టీడీపీ మండల ఇన్‌చార్జి తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి ఆర్డీఓను కోరారు. శనివారం మండలంలోని నాగులగుట్టపల్లె వద్ద ఆర్డీఓ చెన్నయ్య రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి భూ సమస్యలను ఆయన దృష్టి కి తీసుకెళ్లారు.టీడీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహన తనిఖీలు



కడప క్రైం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రతపై వాహన దారులు, ప్రజలు, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా పోలీసుస్టేషన్ల పరిధిలోని విద్యార్థులు, యువత, ఆటో,ట్యాక్సీ లారీ డ్రైవర్లకు, ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కాగా మైనర్లకు వాహనం ఇవ్వకూడదన్నారు.

## నేడు రాములోరి కల్యాణం

చెన్నూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీతారామనామ సంకీర్తన క్షేత్రంలో శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం సీతారామ కళ్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లతో పాటు ఆలయం వద్ద షామియానాలు, విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే కల్యాణోత్సవం, అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు.

## శ్రీచైతన్య పాఠశాలలో బాలల స్నాతకోత్సవం



సర్టిఫికెట్లతో చిన్నారులు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కడప నగరం చిన్నచౌక్ శ్రీచైతన్య పాఠశాలలో శనివారం ఘనంగా బాలల స్నాతకోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వనమాల సుబ్బలక్ష్మి హాజర య్యారు. ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణతో ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ అశోక్, ప్రైమరీ ఇన్‌చార్జి సుభాషిణి, సుకన్యశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా పట్టభద్రుల దినోత్సవం



మాట్లాడుతున్న రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి

సీకేదిన్నె, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రామిరెడ్డి ఫార్మసీ కళాశాలలో పట్టభద్రుల దినోత్సవాన్ని ఎంతో ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నెల్సన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ ఇంతటి కళాశాలను స్థాపించిన యాజమాన్యాన్ని, సేవలు అందిస్తున్న విద్యార్థులను అభినందించారు. విశిష్ఠ అతిథులు డాక్టర్ అవ్వారు అర్జున్, రిటైర్డు డీఎంహెచ్‌వో వెంకటరమణ మాట్లాడుతూ సమాజానికి ఉత్తమ సేవలు అందించి జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం చైర్మన్ ఈశ్వర్‌రెడ్డి, కరస్పాండెంట్ గౌతమ్‌రెడ్డి, సెక్రటరీ జయసుబ్బారెడ్డి, ట్రెజరర్ రామచంద్రారెడ్డి, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డాక్టర్ రమాదేవి చేతుల మీదుగా పట్టాలు అందించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

## కళలకు కాణాచి కడప జిల్లా : ఆప్‌కీ ఆవాజ్

కడప సెవెన్‌రోడ్స్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కళలకు కాణాచి కడప జిల్లా అని ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మక్బుల్ బాష అన్నారు. జిల్లాకు చెందిన రచయిత వేంపల్లె షరీఫ్‌కు సీఎం చేతులుమీదుగా ఉగాది పురస్కారం దక్కడం అభినందనీయమన్నారు. శనివారం ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యాలయంలో రచయిత వేంపల్లె షరీఫ్‌కు ఆప్ కీ ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో సత్కారం ఏర్పాటుచేశారు.ఈ కార్యక్రమంలో ఆప్‌కీ ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ షాజహాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాన్ బాష, జిల్లా కమిటీ సభ్యులు అబిద్ హుస్సేన్, షేక్ షావలి తదితరులు పాల్గొన్నారు.



## ఈ వేస్టు తారు ఎందుకు పోసినట్లు..?

●ప్రమాదాలపాలవుతున్న ప్రజలు ●హైవే అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం



హైవేలో కుప్పలుగా పోసిన తారుతో కూడిన కంకర

చెన్నూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : హైవే లో పలుచోట్ల మరమ్మతుల కోసం తొలగించిన తారుతో కూడిన కంకరను అదే రహదారి పక్కన అంచుల వద్ద పలు చోట్ల కుప్పలుగా పోయడం జరిగింది. కాగా ఈ కుప్పలు రోడ్డు అంచుకు కాస్త పక్కకు పోయకుండా రోడు పైనే పోయడంతో వాటి వల్ల పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. ఎక్కడైనా రహదారికి మరమ్మతులు చేసేటప్పుడు అక్కడ తొలగించిన కంకరను తక్షణం మరో ప్రాంతానికి ఇబ్బందిలేని చోట వేయాలి. కానీ హైవే సిబ్బంది మాత్రం తొలగించిన దానిని రోడ్డు అంచు పక్కనే పలుచోట్ల దారి పొడవునా కుప్పలుగా పోశారు. రాత్రివేళ ద్విచక్ర వాహనాల్లో వచ్చే పలువురు కుప్పలు రోడ్డుపై ఉండడంతో దాన్ని చూడక వాహనాలు అదుపుతప్పి కింద పడి గాయాలపాలవుతున్నారు.

## ఆరంభ శూరత్వమేనా..?

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కడపనగరంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో వేసవిలో ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటుచేశారు.ఆర్భాటంగా మొదలుపెట్టి, ఆచరణలో మాత్రం తుస్సు మనేటట్లు కడప మాచుపల్లె బస్టాండ్ వద్ద చలివేంద్రం బ్యానర్ మాత్రమే కనిపిస్తోంది. అక్కడ తాగడానికి నీరు, కుండలు గాని లేవు. నగరంలో అనేక చోట్ల ఇదే పరిస్థితి. అయినా పట్టించుకోని కార్పొరేషన్ సిబ్బంది. అధికారులు ఆర్భాటంగా ప్రారంభిస్తే సరిపోదు ఆచరణలో నిబద్ధత చూపి దాహాన్ని తీర్చాలని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కడప మాచుపల్లె బస్టాండ్ వద్ద చలివేంద్రంలో కుండలు, నీళ్లులేని దృశ్యం

## నరసింహుడికి ప్రత్యేక పూజలు

బద్వేలు రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వల్లెరవారిపల్లెలోని లక్ష్మీనరసింహస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.





# దొంతికోనకు మంచిరోజులు

- హైడ్రోపవర్ ప్రాజెక్టుతో రూపుమారనున్న ఆలయం
- అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చిన ఆదానీ కంపెనీ
- రూ.70 లక్షలతో మాస్టర్ ప్లాన్ రెడీ



దొంతికోన ఆలయం(ఇన్‌సెట్) స్వయంభువుగా వెలసిన వెంకటేశ్వరస్వామి



దొంతికోన సమీపంలో కొనసాగుతున్న హైడ్రోపవర్ ప్రాజెక్టు పనులు

కొండాపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) హైడ్రోపవర్ ప్రాజెక్టు రాకతో మండలంలోని ప్రముఖ క్షేత్రం దొంతికోనకు మంచి రోజులు రానున్నాయి. దీంతో ఆలయం రూపురేఖలు మారనున్నాయి. ఎర్రమల్ల కొండల్లో దొంతికోన వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మితమైంది. కొండల్లోని దొంతిలో వెంకటేశ్వర స్వామి స్వయంభువుగా వెలసి ఉండటంతో ఈ ఆలయాన్ని దొంతికోనగా పిలుస్తుంటారు. ప్రకృతి మధ్య జననివాసానికి దూరంగా అటవీ ప్రాంతంలో ఉన్న ఈ క్షేత్రం ఇప్పుడిప్పుడే దాతల సహాయంతో చక్కగా రూపు దిద్దుకొంటోంది. దొంతికోన వెంకటేశ్వర స్వామి ఆలయం పక్కనే సుబ్బరాయుడు స్వామి, కొండ పైన లక్ష్మీనరసింహస్వామి ఆలయాలు ఉన్నాయి. ఒక ఇంచు నీరు కొండలో నుంచి ఎప్పటికీ తగ్గకుండా వస్తుండటం స్వామి మహిమగా భక్తులు చెబుతుంటారు. కోనకు వచ్చే భక్తులు ఈ నీటిని వినియోగిస్తుంటారు. ప్రతి శనివారంతో పాటు, కార్తీక, శ్రావణం, మాఘ మాసంలో అనేక మంది భక్తులు స్వామి దర్శనానికి కోనకు వస్తారు. మనరాష్ట్రంలోనే కాక పొరుగు రాష్ట్రమైన కర్ణాటక నుంచి కూడా స్వామికి భక్తులు వస్తుంటారు.

### హైడ్రోపవర్ ప్రాజెక్టుతో రూపుమారనున్న దొంతికోన

మండలకేంద్రమైన కొండాపురానికి దొంతికోన ప్రస్తుతం 70 కిలోమీటర్ల దూరంలో ఉంది. స్వామి ఆలయం కొండపై ఉండటం, కొండ కింద నే గండికోట ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ఉంది. ఈప్రాంతం ఎత్తులో ఉండటం, గండికోట బ్యాక్ వాటర్ కింద ఉండటంతో ఆదానీ కంపెనీ హైడ్రోపవర్ ప్రాజెక్టుకు అనువుగా భావించి నిర్మాణాన్ని చేపడుతోంది. ఆలయం పక్కనే పనులు చేస్తుండటంతో దొంతికోన వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ఆదానీ కంపెనీ ముందుకు వచ్చినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం కోనకు రావడానికి రాగికుంట గ్రామం వద్దకు మాత్రమే తారురోడ్డు ఉంది. అక్కడినుంచి కోన కు వెళ్లడానికి ఆలయం తరఫున ప్రస్తుతం మట్టిరోడ్డు మాత్రమే ఉంది. ఆలయాన్ని అందంగా , సహజసిద్ధంగా పునర్నిర్మిస్తామని ఆదానీ కంపెనీ చెబుతోంది. ప్రస్తుతం ఆల యాన్ని ఆర్కిటెక్చర్ల సహాయంతో కొలతలు తీసు కొని మాస్టర్‌ప్లాన్‌ను తీసుకున్నారు. ప్లాన్‌ను బట్టి సుమారు రూ.70 లక్షలు వరకు ఖర్చవుతుందని కంపెనీ భావిస్తోంది. ఆలయాన్ని పునర్నిర్మిస్తే దొంతికోన మరింత అభివృద్ధి చెందుతుంది.

### ఆలయం అభివృద్ధి చేస్తే భక్తులు పెరుగుతారు

మారుమూల కొండల్లో ఉన్న దొంతికోనను మరింత అభివృద్ధి చేస్తామని ఆదాని కంపెనీ చెబుతోంది. ఇప్పటికే కంపెనీ వారు కోన వద్దకు వచ్చి ఆలయం చుట్టు పక్కల కొలతలు తీసుకొని వెళ్లారు. దొంతికోనను అభివృద్ధి పరిస్తే భక్తుల సంఖ్య పెరుగుతుందనంలో సందేహం లేదు.

-రామాంజలు,ఆలయ అర్చకుడు,దొంతికోన

## వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి



సుమోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ రాజగోపాల్

బద్వేలుటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : వాహనాలను నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని శనివారం సుమోడ్రైవర్లకు సీఐ రాజగోపాల్ అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ నిబంధనలు తప్పకుండా పా టించాలని, లైసెన్స్‌లు తప్పనిసరిగా కలిగి ఉండాలని, సెల్‌ఫోన్లు మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు సత్యనారాయణ, రవికుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## హెల్మెట్ లేకుంటే జరిమానా తప్పదు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే వెయ్యి రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందని పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం ఎరోడ్డు భద్రతా గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, అలా చేస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు.





## సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలి



నిరసన తెలియజేస్తున్న ప్రజలు

బద్వేలుటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని గుంతపల్లె ఎన్‌హెచ్67 వద్ద సర్వీసు రోడ్డును ఏర్పాటు చేయాలని శనివారం గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో రోడ్డు పనులు మొదలైనప్పుడు ఫ్లైఓవర్ పూర్తికాగానే సర్వీసురోడ్డును ఏర్పాటు చేస్తామని చెప్పి రోడ్డుపనులు పూర్తి అయినా ఇంత వరకు సర్వీసురోడ్డును వేయకపోవడం దారుణమన్నారు. గుంతపల్లె వద్ద అనేకగ్రామాలకు, బద్వేలు చెరువుకు, చెన్నంపల్లె చెరువుకు కేంద్రబిందువుగా ఉంటుందని, ఇక్కడ సర్వీసు రోడ్డును ఏర్పా టు చేయాలని అనేక మార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా వారు పట్టించుకోలేదన్నారు. రైతులు ఏవైనా ఎరువులు, ధాన్యం తెచ్చుకోవాలన్నా 5కిలోమీటర్ల తిరిగి వెళ్లాల్సి ఉంటుందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వీసురోడ్డును ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.





## కేసు నమోదు

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఐ తనని డబ్బులు ఇమ్మని బెదిరిస్తున్నాడని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఎస్.రహీంద్రపై కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నాగేంద్ర ప్రొద్దుటూరు మండలంలోని నంగనూరు పల్లె వద్దనుంచి రూ.1500 ఇసుక తీసుకుని ఆళ్లగడ్డలో రూ.5000లకు అమ్మేవాడు. అయితే ఆళ్లగడ్డ రూరల్ ఎస్‌ఐ హరిప్రసాద్ డబ్బులు తీసుకుని కూడా వాహనాన్ని సీజ్‌చేసి ఇబ్బంది పెట్టాడని, మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈమేరకు పోట్ల దుర్తి వీఆర్‌వో హేమ ఇచ్చిన ఫిర్యాదు మేర కు కేసునమోదు చేసి, విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.





## ప్రమాదాల నివారణకు చర్యలు

దువ్వూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఇడమడక చెక్‌పోస్టు వద్ద శనివారం రోడ్డు ప్రమాదాల నివారణకోసం డ్రమ్ములను ఏర్పాటు చేశారు. నాలుగురోడ్ల రహదారి వెంబడి వెళ్లే వాహనాలు వేగంగా వెళ్లకుండా ఏర్పాట్లు చేసినట్లు ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

## నవమి వేడుకలకు ముస్తాబైన రామాలయాలు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి ఉత్సవాలకు పోరుమామిళ్ల మండలంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. పోరుమామిళ్లలోని మల్లకతవ సమీపంలో ఉన్న రామాలయం, చిదానందనగర్‌లో ఉన్న రామాలయం, శ్రీరామ్‌నగర్‌లో ఉన్న రామాలయం, రెడ్డినగర్‌లో ఉన్న రామాలయం, టీటీడీ కళ్యాణమండపం సమీపంలో ఉన్న రామాలయం, కమ్మవారిపల్లె లోని రామాలయం, చల్లగిరిగెలలోని పట్టాభిరామస్వామి ఆలయాల్లో ఆదివారం భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలను నిర్వహించనున్నారు.

**ప్రత్యేక బస్సులు:** శ్రీరామనవమి సందర్భంగా చల్లగిరిగెల పట్టాభిరామస్వామి కల్యాణోత్సవానికి బద్వేలు నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజరు నిరంజన్ తెలిపారు. శ్రీరామనవమి సందర్భంగా ఉదయం 7 నుంచి చల్లగిరిగెలకు పోరుమామిళ్ల నుంచి బస్సులు ఉంటాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**కొండాపురంలో:** మండలంలోని గ్రామగ్రామాన శ్రీరామినవమి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నారు. మండలంలోని కొండాపురం పాత ఊరిలోని రామాలయంలోనూ, గండ్లూరు , ఓబన్నపేట, చౌటిపల్లె, తదితర చోట్ల నవమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. గండ్లూరు రామాలయంతో పాటు పలుచోట్ల సీతారాముల కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గండ్లూరుతో పాటు పలుచోట్ల అన్నదాన కార్యక్రమం, పలుచోట్ల భజన కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

**దువ్వూరులో:** దువ్వూరులో ఆదివారం జరిగే శ్రీరామ నవమి పండుగను పురష్కరించుకుని ఆలయం ముందు భాగంలో తోరణాలు కట్టి రంగుల దీపాలతో అలంకరించారు. దీంతోపాటు పలు గ్రామాల్లో రామాలయాలను ముస్తాబు చేశారు. పాత దువ్వూరులోని కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

**ఖాజీపేటలో:** శ్రీరామ నవమిని పురష్కరించుకుని గ్రామాల్లో వెలసిన రామాలయాలు విద్యుద్దీపాలతో ముస్తాబయ్యాయి. ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా ఖాజీపేట అగ్రహారం, భూమాయపల్లె , కూనవారిపల్లె, నాగపట్నం, ఇంకా పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహిస్తున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు భారీ ఎత్తున ఏర్పాటు చేయడంతోపాటు వేసవిని పురష్కరించుకుని భక్తులకోసం చలువ పందిర్లు ఏర్పాటు చేశారు.

**మైదుకూరు రూరల్‌లో :** స్థానిక రామాలయం వీధిలోని కోదండ రామాలయంలో ఆదివారం సీతా,రాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మైదుకూరులోని పాతూరు కోదండ రామాలయంలో రాయలసీమలోనే ఎక్కడ లేనటువంటి పాలరాతి విగ్రహాలు ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం 9గంటలకు సీతా రాముల కల్యాణం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ సాయంత్రం ఊరేగింపు ఉంటుందన్నారు.

**జమ్మలమడుగులో:** జమ్మలమడుగులో ఆదివారం శ్రీరామనవమి పర్వదినం పురష్కరించుకుని ఆలయాలు ముస్తాబయ్యాయి. పట్టణంలోని పార్కువీధి, కన్నెలూరు, గూడెం చెరువు, గండికోట, మోరగుడిలోని ఆంజనేయస్వామి ఆలయం, తాడిపత్రి రోడ్డులో లక్ష్మీనగర్, పట్టాభిరామాలయం వేడుకలకు సర్వం సిద్ధమయ్యాయి.

## నీడకోసం ఏర్పాటు



జమ్మలమడుగు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పాత బస్టాండులో ప్రయాణికుల కోసం టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి నీడ ఏర్పాటుకు షెల్టర్ ఏర్పాటు చేశారు. గతంలో ప్రయాణికులు బస్టాపు వద్ద నీడలేక ఎండకు, వర్షానికి ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం వేసవి ఉష్ణోగ్రతలు పెరగడం బస్టాపు వద్ద షెడ్డు ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తూ భూపేశ్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.

## నిత్యావసర సరుకులు అందజేత

బద్వేలు రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రామాంజనేయనగర్‌లో అనారోగ్యంతో నడవలేని పరిస్థితుల్లో ఉన్న అల్తాఫ్ అనే వ్యక్తికి శనివారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు ధర్మిశెట్టి వెంకటసుబ్బయ్య రాయల్ ఆధ్వర్యంలో బియ్యం ఇతర నిత్యావసర వస్తువులనుఅందించారు. ఈ సందర్భంగా ధర్మిశెట్టి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అల్తాఫ్‌కు పెన్షన్ వచ్చేలా చూస్తామన్నారు.

## రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 26 నుంచి మూడు రోజులపాటు రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సంయుక్త కార్యదర్శి పీటర్ తెలిపారు. శనివారం శిక్షణ తరగతుల కరపత్రాలను ఏఐఎస్‌ఎఫ్ కార్యాలయంలో ఆవిష్కరించి ఆయన మాట్లాడారు.

## రేషన్ కోసం పరేషాన్



సూర్యోదయం కాకముందే రేషన్‌షాపు వద్ద పడిగాపులు కాస్తున్న జనం

దువ్వూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం కోసం వినియోగదారులు పరేషాన్ అవుతున్నారు. మండలంలోని కానగూడూరులో శనివారం తెల్లవారుజాము నుంచి జనాలు పంపిణీ కేంద్రం వద్దకు వచ్చి కాపుకాశారు. 5వ తేదీ అందులోనూ పండుగ వచ్చినా ఇంకా పంపిణీ చేయకపోవడం పట్ల ప్రజలు ఆందోళన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జాన్సన్ దృష్టికి తీసుకెళ్లగా కానగూడూరులో రెండు చౌక దుకాణాలు ఉన్నాయని మొదటి దానిలో పంపిణీ పూర్తయ్యాక రెండవ షాపులో మొదలు పెడుతామని, అందువలన ఆలస్యం జరిగిందని చెప్పారు.

## 'వక్ఫ్‌బోర్డు బిల్లు ఆమోదం రాజ్యాంగ విరుద్ధం'

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఆమోదించిన వక్ఫ్‌బోర్డు బిల్లు రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇర్ఫాన్‌బాష పేర్కొన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ముస్లింలను అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19, 22, 26లను ధిక్కరించి వక్ఫ్‌బిల్లును చేసిందని విమర్శించారు. ఈ బిల్లు వలన ప్రస్తుతం మసీదులు, మదరసాలు 300 సంవత్సరాల ఆధారాలు చూపించాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవడానికి టీడీపీ, వైసీపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

## బాబు జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి



బాబుజగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

జమ్మలమడుగు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి):స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి దళిత ఉప ప్రధాని బాబుజగ్జీవన్‌రామ్ సేవ లు మరువలేనివని వక్తలు కొనియాడారు. డివిజన్ కేంద్రమైన జమ్మలమడుగు పట్టణంలో శనివారం సమతావాది డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ లింగప్ప, ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు పిచికెబాబు, గురప్ప, నరసింహులు, చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మున్సిపల్ వైస్‌ఛైర్మన్-2 సింగరయ్య, వైసీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పలపాటి యోబు, చేనేత విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి బడిగించల చంద్రమౌళి పూలమాల వేసి నివాళులర్పించారు. డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, చేనేత సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ పాల్గొన్నారు.

**బద్వేలు/రూరల్‌లో:** పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ భవన్‌లో శనివారం బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కూటమి నాయకుడు బొజ్జ రోశన్న, సొద్దల పెంచలయ్య మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ రవి, ఈఎంఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు చాట్ల యల్లయ్య, సామాజిక చైతన్య సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ , భవన సాధన సమితి ప్రధాన కార్యదర్శి నాగార్జున పాల్గొన్నారు. నియోజకవర్గ ఎంఈఎఫ్ నాయకుడు ఎర్రపల్లి ఓబయ్య ఆధ్వర్యంలో సిద్దవటం రోడ్డులోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, ఎంఈఎఫ్ నాయకులు పాల్గొన్నారు. దళిత గిరిజన వెనుకబడి న తరగతుల అభివృద్ధికి జీవితాన్ని అంకితం చేసిన బాబు జగ్జీవన్‌రామ్ చిరస్మరణీయుడని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నాగదాసరి ఇమ్మానుయేల్, వర్కిం గ్ ప్రెసిడెంటు వెంకటరమణ అన్నారు. స్థానిక సిద్దవటం రోడ్డులోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రజక వృత్తిదారుల సమైఖ్య జిల్లా నాయకులు నాగరాజు, వెంకటేశ్, బ్రహ్మయ్య, సుధాకర్, మహేశ్, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

**చాపాడులో:** ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతిసందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ణమాదిగ , నాయకులు భాస్కర్, సత్యనారాయణ, సంజీవ్, తదితరులు నివాళులు అర్పించారు.



బాబు జగ్జీవన్‌రామ్, వీణా విజయరామరాజులకు నివాళులర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

**పోరుమామిళ్లలో** :సమాజం కోసం ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమం కోసం జీవితాన్నిధారబోసిన మహానుబావులు బాబు జగ్జీవన్‌రామ్, వీణా విజయరామరాజు అని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, సీపీఎస్ రాష్ట కన్వీనరు సుబ్రమణ్యం అన్నారు. శనివారం పోరుమామిళ్లలోని ఎస్టీయు భవన్‌లో రీజనల్ కన్వీనరు క్రిష్ణారెడ్డి అధ్యక్షతన బాబు జగ్జీవన్‌రామ్ జయంతి, వీణా విజయరామరాజు వర్థంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే రంగసముద్రం 1వ సచివాలయంలో సర్పంచ్ చిత్తా రవిప్రకశ్‌రెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ బాబుజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు సంద ర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. .

## బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రజాసంఘాలు, నాయకులు

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు గడ్డం నరసింహులు, ఓబులేసు, ప్రతాప్‌రెడ్డిలు కోరారు. శనివారం ప్రజాసంఘాల కార్యాలయంలో బాబుజగ్జీవన్‌రామ్ జయంతిని పురష్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ఉపప్రధానిగా విశేష సేవలు అందించిన బాబుజగ్జీవన్‌రామ్ ప్రొద్దుటూరులో విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్య మాదిగ, జగన్, బయన్న, లింగమయ్య, శ్రీను, దాసు, నరసింహ పాల్గొన్నారు.

## లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని శిక్షించాలి



సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలియజేస్తున్న నేతలు

బద్వేలు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): చిన్నారులపైచ లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద సీపీఐ ఏపీ మహిళా సమాఖ్య బద్వేలు ప్రధాన సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రక్షణ లేని విద్యాసంస్థలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, మహిళా సంఘం నేతలు విజయమ్మ, నవనీతమ్మ పాల్గొన్నారు.

## సీపీఎం జాతీయ మహాసభలకు తరలిన కార్యకర్తలు



సీపీఎం జాతీయ మహాసభలకు తరలి వెళుతున్న కార్యకర్తలు

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జాతీయ మహాసభలకు పట్టణానికి చెందిన ఆ పార్టీ కార్యకర్తలు శనివారం మధ్యాహ్నం తరలి వెళ్లారు. మదురైలో జరుగుతున్న ఆ పార్టీ జాతీయ మహాసభలు రెండవ తేదీ నుంచి ప్రారంభం అయ్యాయి. ఆదివారం ర్యాలీ, బహిరంగ సభను పురష్కరించుకుని ఆ బహిరంగ సభలో పాల్గొనడానికి పట్టణానికి చెందిన సీపీఎం కార్యకర్తలు బస్సులో బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి జాతీయ మహాసభలు జరుగుతాయని, ఈ మూడు సంవత్సరాల కాలంలో ప్రజలకు చేసిన మేలును గుర్తించడం, ప్రజలు ఇబ్బందులు పడుతున్న అంశాలపై కార్యాచరణ రూపొందించి ఉద్యమాలకు సిద్ధమవుతామన్నారు. కార్యక్రమంలో ముంతాజ్, సర్వేశ్వరి, విజయకుమారి, రాములమ్మ పాల్గొన్నారు.

## రైతులను మోసం చేసిన విత్తన కంపెనీపై కేసులు పెట్టాలి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : రైతులను మోసం చేసి పారిపోయిన పొగాకు సీడ్స్ కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ నాయకులు మస్తాన్, రవి, కేశవలు డిమాండ్ చేశారు. శనివారం వారు పాత్రికేయులతో మాట్లాడుతూ బి.కోడూరు, కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల మండలాల్లో పొగాకు ఏజన్సీలు రైతులకు మాయమాటలు చెప్పి పంట పండిన తరువాత నెలల తరబడి పొగాకు సరుకు చెప్పిన రేటు ప్రకారం తీసుకువెళ్లకుండా పత్తా లేకపోవడం దారుణమన్నారు. దాదాపు వెయ్యి ఎకరాలకు పైగా పొగాకు రైతులు సాగు చేశారని, దీనికి పరిహారం అందించాలని లేదంటే రైతులకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు. ఒక్కో కుటుంబానికి 30వేల చొప్పున నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్నికోరారు.

## విద్యుత్ బకాయిలపై దృష్టిపెట్టండి

- కొత్త లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు వెంటనే ఏర్పాటు

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బకాయిలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని డిస్కం ఈఈ కేవీరమణారెడ్డి అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఎర్రగుంట్లలో లైన్, ఇంజినీరింగ్, అకౌంట్స్ స్టాఫ్‌తో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలపై సిబ్బంది ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. కొత్త లైన్ల ఏర్పాటుపై చర్చించి అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్స్ విషయంపై సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. ముఖ్యంగా విద్యుత్ బకాయిలు వసూళ్లపై ఎక్కువ శ్రద్ధపెట్టాలన్నారు. ఈకార్యక్రమంలో ఏడీఈ కిరణ్‌కుమార్, ఏఈలు ప్రియదర్శన్‌రెడ్డి, చంద్రశేఖర్, చాంద్‌బాషా, హరిప్రసాద్‌రెడ్డి, ఏవో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

